


# ప్రజాస్ఫూర్తి

PRAJASPOORTHI TELUGU DAILY

తెలుగు దినపత్రిక

PS NEWS

మేడ్చల్ - మల్కాజిగిరి | ఎడిటర్ - గడ్డమీది బాలరాజు | ఆదివారం 08-02-2026 | సంపుటి - 26 | సంచిక -260 | రూ : 4 | పేజీలు: 8


## జాతర ముగింపు.. టన్నుల కొద్దీ చెత్త, జంతు వ్యర్థాలతో..


# మురికికూపంలా మేడారం

- మేడారం మహాజాతర ముగింపుతో భారీగా పేరుకుపోయిన వ్యర్థాలు
- సుమారు 3 వేల టన్నుల చెత్త పోగైనట్లు అధికారుల అంచనా
- శుభ్రం చేసేందుకు రంగంలోకి దిగిన 6 వేల మంది పారిశుద్ధ్య కార్మికులు
- జంతు వ్యర్థాలు చూసి వాంతులొస్తున్నాయని కార్మికుల ఆవేదన
- వ్యర్థాల్లో 48 శాతం ప్లాస్టిక్, గాజు సీసాలు ఉండటంపై ఆందోళన

5లో








# కేసీఆర్‌ది చెరగని దగా చరిత్ర

- మరో ఎనిమిదేళ్లు రాష్ట్రంలో ఇందిరమ్మ పాలనే
- భాజపాతో భారాస చీకటి ఒప్పందం
- పరిగి శివారు నారాయణపూర్ సభలో సీఎం రేవంత్‌రెడ్డి
- విచారణకు పిలిస్తే తప్పేంటి?



పరిగి: 'భారాస అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ చరిత్రను నేను చెరిపేస్తున్నానని ఆ పార్టీ నేతలు వాపోతున్నారు. కానీ ఆయన దగా చరిత్ర నేను చెరిపినా చెరగదు' అంటూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఎద్దేవా చేశారు. వికారాబాద్ జిల్లా పరిగి శివారులో తరువాయి 2లో




## త్వరలోనే మలేషియాలో తొలి భారత కాన్సులేట్...

### ప్రధాని మోదీ ప్రకటన

- మలేషియా పర్యటనలో మోదీకి ఘన స్వాగతం
- భారత్‌మలేషియా బంధానికి 'ఇంపాక్ట్' మార్గదర్శి అని వెల్లడి
- మలేషియాలోని భారత సంతతి సేవలను కొనియాడిన ప్రధాని
- మలయా యూనివర్సిటీలో తిరువళ్లువర్ సెంటర్ ఏర్పాటుకు హామీ

2లో

## క్వాంటమ్ విప్లవానికి మనదే నాయకత్వం..

# ఇది చారిత్రక ఘట్టం: సీఎం

- అమరావతిలో క్వాంటమ్ వ్యాలీ భవనానికి శంకుస్థాపన
- ఇది కేవలం ఏపీకి కాదని, యావత్ భారతదేశ చరిత్రలో ఒక చారిత్రక రోజని సీఎం వ్యాఖ్య
- క్వాంటమ్ విప్లవానికి భారత్ నాయకత్వం వహిస్తుందన్న ధీమా
- హైదరాబాద్‌కు హైటెక్ సిటీలా, దేశానికి క్వాంటమ్ సెంటర్ గేమ్ ఛేంజర్ అవుతుందని ప్రకటన
- ఈ నెల 16న మైక్రోసాఫ్ట్ వ్యవస్థాపకుడు బిల్ గేట్స్ అమరావతికి రానున్నట్లు వెల్లడి



2లో



2లో

## 'ఫోన్ ఇన్'... హైడ్రా కమిషనర్‌కు ఫోన్ చేసి సమస్యలు చెప్పిన ప్రజలు

## ఫోరెన్సిక్ ల్యాబ్‌లో అగ్నిప్రమాదం..

# కారణం వెల్లడించిన ఫైర్ డీజీ విక్రమ్ సింగ్




2లో

- ఫోరెన్సిక్ ల్యాబ్‌లోని సీజ్డ్ ప్రాపర్టీస్ గదిలో అగ్ని ప్రమాదం
- 1980ల నాటి భవనమని వెల్లడించిన ఫైర్ డీజీ విక్రమ్ సింగ్
- చివరి గదిలో స్విచ్ బోర్డు వద్ద షార్ట్ సర్క్యూట్ అయినట్లు వెల్లడి

## టీ20 వరల్డ్ కప్ 2026

# అమెరికాపై విజయంతో టీమిండియా శుభారంభం




2లో

# టీ20 వరల్డ్ కప్ 2026: అమెరికాపై విజయంతో టీమిండియా శుభారంభం

ఐసీసీ టీ20 ప్రపంచకప్2026 ప్రస్థానాన్ని టీమిండియా గెలుపుతో ప్రారంభించింది. ముంబైలోని వాంఖడే స్టేడియం వేదికగా శనివారం జరిగిన తమ తొలి మ్యాచ్‌లో అమెరికాపై 29 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ (84 నాటౌట్) అద్భుతమైన ఇన్నింగ్స్‌తో జట్టును ఆదుకోగా, బౌలర్లు సమష్టిగా రాణించి భారత్‌కు చిరస్మరణీయ విజయాన్ని అందించారు. ఈ గెలుపుతో సూర్యకుమార్ సేన టోర్నీలో శుభారంభం చేసింది. 162 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన అమెరికాకు కూడా సరైన ఆరంభం లభించలేదు. భారత పేసర్లు మహమ్మద్ సిరాజ్, అర్ష్‌దీప్ సింగ్ ధాటికి 13 పరుగులకే 3 వికెట్లు కోల్పోయింది. అయితే మిలింద్ కుమార్ (34), సంజయ్ కృష్ణమూర్తి (37) ఆదుకునే ప్రయత్నం చేశారు. చివర్లో శుభమ్ రంజనే (22 బంతుల్లో 37) మెరుపులు మెరిపించి కాసేపు ఉత్కంఠ రేపాడు. కానీ, భారత బౌలర్లు కట్టుదిట్టంగా బౌలింగ్ చేసి అమెరికాను పుంజుకోనీయలేదు. భారత బౌలర్లలో మహమ్మద్ సిరాజ్ 3 వికెట్లు పడగొట్టగా, అర్ష్‌దీప్ సింగ్, అక్షర్ పటేల్ చెరో రెండు వికెట్లు తీశారు. దీంతో అమెరికా 20 ఓవర్లలో 8 వికెట్లకు 132 పరుగులు మాత్రమే చేసి ఓటమిపాలైంది. ఈ మ్యాచ్‌లో టాస్ గెలిచిన అమెరికా ఫీల్డింగ్ ఎంచుకుంది. దీంతో బ్యాటింగ్‌కు దిగిన భారత్‌కు ఆరంభంలోనే భారీ షాక్ తగిలింది. ఓపెనర్ అభిషేక్ శర్మ (0) ఖాతా తెరవకుండానే వెనుదిరిగాడు. ఇషాన్ కిషన్ (20), తిలక్ వర్మ (25) మంచి ఆరంభాలనే అందుకున్నా, వాటిని భారీ స్కోర్లుగా మలచలేకపోయారు. ఒకే ఓవర్లో తిలక్ వర్మ, శివమ్ దూబె (0) వికెట్లను కోల్పోవడంతో భారత్ 46 పరుగులకే 4 వికెట్లు కోల్పోయి పీకల్లోతు కష్టాల్లో పడింది. ఈ దశలో కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ తనదైన శైలిలో ఇన్నింగ్స్‌ను నిర్మించాడు. ఒకవైపు వికెట్లు పడుతున్నా, మరో ఎండ్‌లో సూర్యకుమార్ ఒంటరి పోరాటం చేశాడు. కేవలం 49 బంతుల్లో 10 ఫోర్లు, 4 సిక్సర్లతో 84 పరుగులు చేసి అజేయంగా నిలిచాడు. రింకూ సింగ్ (6), హార్దిక్ పాండ్యా (5) విఫలమైనా, చివర్లో అక్షర్ పటేల్ (14)తో కలిసి జట్టు స్కోరును ముందుకు నడిపించాడు. సూర్య సూపర్ ఇన్నింగ్స్ కారణంగా టీమిండియా నిర్ణీత 20 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 161 పరుగుల గౌరవప్రదమైన స్కోరు చేయగలిగింది. అమెరికా బౌలర్లలో వాన్ షాల్క్‌విక్ 4 వికెట్లతో సత్తా చాటాడు. ఇక, మెగా టోర్నీలో భారత్ తన తదుపరి మ్యాచ్ ను ఫిబ్రవరి 12న నమీబియాతో ఆడనుంది. గ్రూప్‌ఏలో భాగంగా జరగనున్న ఈ మ్యాచ్ కు ఢిల్లీలోని అరుణ్ జైట్లీ స్టేడియం వేదికగా నిలవనుంది.

## అమెరికాతో భారత్ ఒప్పందంపై
# పురందేశ్వరి ట్వీట్

భారత్‌అమెరికా మధ్య కుదిరిన వాణిజ్య ఒప్పందం దేశంలోని రైతులకు సంపూర్ణ భద్రత కల్పిస్తుందని బీజేపీ నేత, రాజమండ్రి ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి అన్నారు. ఈ ఒప్పందం ద్వారా రైతు ప్రయోజనాలను కాపాడుతూనే, వ్యవసాయ ఎగుమతులకు కొత్త అవకాశాలు లభిస్తాయని ఆమె తెలిపారు. ఈ ఒప్పందం ప్రకారం గోధుమ, బియ్యం, మొక్కజొన్న, పప్పుధాన్యాలు వంటి ప్రధాన పంటలపై ఎలాంటి సుంకాల తగ్గింపులు లేదా కోటాలు లేవని పురందేశ్వరి స్పష్టం చేశారు. కాబూలీ శనగ, పచ్చి బఠాణీ వంటి వాటితో పాటు నారింజ, చిలగడదుంప వంటి ఉద్యాన పంటల రైతుల ప్రయోజనాలకు కూడా పూర్తి రక్షణ లభిస్తుందని ఆమె వివరించారు. దీనివల్ల లక్షలాది మంది రైతులకు ఆదాయ భరోసా కొనసాగుతుందని చెప్పారు. మరోవైపు, ఈ ఒప్పందం ద్వారా భారత్‌లో తయారైన ప్రాసెస్ చేసిన ఆహార ఉత్పత్తులు, ఆర్గానిక్ వ్యవసాయ ఉత్పత్తులకు అమెరికా మార్కెట్‌లో సులభంగా ప్రవేశం లభిస్తుందని పురందేశ్వరి పేర్కొన్నారు. ఇది దేశీయ ఎగుమతులకు ఊతమిచ్చి, గ్రామీణ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. దృఢమైన నాయకత్వం వల్లే రైతు భద్రత, ఆహార భద్రత, ఆర్థిక ప్రగతి సాధ్యమవుతున్నాయని ఆమె వ్యాఖ్యానించారు. ఈ మేరకు ఆమె ట్వీట్ చేశారు. "భారత్, అమెరికా మధ్య కుదిరిన కీలక వాణిజ్య ఒప్పందం దేశీయ వ్యవసాయ రంగానికి పూర్తిస్థాయిలో రక్షణ కల్పిస్తోంది. ఎగుమతులకు కొత్త ఊపునిస్తూనే, దేశీయ రైతుల ప్రయోజనాలను కాపాడేలా సమతుల్య విధానంతో ఈ ఒప్పందాన్ని రూపొందించారు. ఒప్పందం ప్రకారం, సున్నితమైన వ్యవసాయ ఉత్పత్తులపై భారత్ ఎలాంటి సుంకాల రాయితీలు కానీ, మార్కెట్ యాక్సెస్ కానీ ఇవ్వలేదు. ముఖ్యంగా అరటి, మామిడి, సిట్రస్ పండ్లు, బెర్రీలు వంటి ఉద్యాన పంటలకు సంపూర్ణ రక్షణ కల్పించారు. దీంతో దిగుమతుల ఒత్తిడి లేకుండా రైతుల ఆదాయానికి భద్రత చేకూరనుంది. ఉల్లిపాయలు, మష్రూమ్స్, వెల్లుల్లి, బంగాళాదుంప, బఠాణీ, శనగలు, బీన్స్ వంటి ప్రధాన కూరగాయలన్నీ రక్షణ పరిధిలోనే ఉన్నాయి. విదేశీ పోటీ నుంచి దేశీయ రైతులకు భరోసా కల్పిస్తూ, ధరల స్థిరత్వాన్ని కాపాడటమే లక్ష్యంగా ఈ నిర్ణయాలు తీసుకున్నారు. ఆహార భద్రత, గ్రామీణ జీవనోపాధికి భంగం కలగకుండానే వాణిజ్యాన్ని వృద్ధి చేసే దిశగా ఈ ఒప్పందం దోహదపడనుంది" అని వివరించారు.

## 'ఫోన్ ఇన్'... హైడ్రా కమిషనర్‌కు
# ఫోన్ చేసి సమస్యలు చెప్పిన ప్రజలు

హైడ్రా కమిషనర్ రంగనాథ్‌కు హైదరాబాద్ నగర ప్రజలు ఫోన్ చేసి సమస్యలను చెప్పుకున్నారు. హైడ్రా కార్యాలయంలో ఆయన తొలిసారి 'ఫోన్ ఇన్' కార్యక్రమం చేపట్టగా, గంటలోనే 36 మంది ఫోన్ చేశారు. భూ ఆక్రమణలు, నీటి వనరులు కలుషితం కావడం వంటి సమస్యలను ఆయన దృష్టికి తీసుకువచ్చారు. ప్రభుత్వ స్థలాలు, నీటి వనరుల పరిరక్షణ కోసం హైడ్రా పరిధిని ఔటర్ రింగ్ రోడ్డు బయటకు కూడా విస్తరించాలని ప్రజలు కోరారు. తమ ప్రాంతాల్లోని చెరువులో మురుగు నీరు వచ్చి చేరుతోందని, దుర్గంధభరిత వాతావరణంతో ఇబ్బందులు పడుతున్నామని కొంతమంది కమిషనర్ దృష్టికి తీసుకువచ్చారు. గుర్రపు డెక్క పెరిగి దోమలతో ఇబ్బందిపడుతున్నట్లు చెప్పారు. ఇతర చెరువుల్లాగే తమ ప్రాంతంలోని చెరువులనుకూడా అభివృద్ధి చేయాలని కోరారు. ప్రతి సోమవారం హైడ్రా ప్రజావాణి ఉంటుంది. కానీ ప్రజలతో నేరుగా మాట్లాడేందుకు కమిషనర్ 'ఫోన్ ఇన్' కార్యక్రమం చేపట్టారు. హైడ్రా కార్యాలయం వరకు రాలేనివారు సమస్యలను ఫోనులో చెప్పుకునే అవకాశం కల్పించారు. శనివారం మధ్యాహ్నం 12 గంటల నుంచి 1 గంట వరకు 'ఫోన్ ఇన్' కార్యక్రమం జరగగా, స్వయంగా కమిషనర్ రంగనాథ్ ఫిర్యాదుదారులతో మాట్లాడారు. ప్రజల సమస్యలను విని పరిష్కారానికి సంబంధిత అధికారి వివరాలను వారికి అందజేశారు. వారం రోజుల తర్వాత కూడా సమస్య పరిష్కారం కాకుంటే నేరుగా తనకు ఫోను చేయాలని ఫిర్యాదుదారులకు సూచించారు. సెలవు రోజుల్లో మినహా ప్రతి శనివారం 04029565750, 04029565759 ఈ నంబర్లకు ఫోను చేసి సమస్యలను తెలియజేయాలన్నారు. ఈ సందర్భంగా జిల్లాల నుంచి పలువురు ఫోన్లు చేసి తమ వద్ద కూడా చెరువులు ఆక్రమణలకు గురవుతున్నాయని, వాటిని కాపాడాలని కోరారు. అయితే హైడ్రా పరిధి ఓఆర్ఆర్ వరకేనని రంగనాథ్ స్పష్టం చేశారు. మొదటి విడతలో 6 చెరువులను అభివృద్ధి చేశామని, త్వరలో మరో 14 చెరువులను అభివృద్ధి చేస్తామని అన్నారు.




## ఫోరెన్సిక్ ల్యాబ్‌లో అగ్నిప్రమాదం..
## కారణం వెల్లడించిన ఫైర్ డీజీ విక్రమ్ సింగ్

నాంపల్లిలోని ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబ్‌లో జరిగిన అగ్ని ప్రమాదంపై ఫైర్ డీజీ విక్రమ్ సింగ్ స్పందించారు. ఈ ప్రమాదానికి షార్ట్ సర్క్యూట్ కారణమని భావిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఫోరెన్సిక్ ల్యాబ్‌లోని సీజ్డ్ ప్రాపర్టీస్ గదిలో అగ్నిప్రమాదం జరిగింది. ఈ గది పూర్తిగా దగ్ధమైనట్లు అధికారులు వెల్లడించారు. ప్రమాదం జరిగిన వెంటనే ఫైర్ డీజీ విక్రమ్ సింగ్ సంఘటన స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ, ఈ ఫోరెన్సిక్ భవనం చాలా పాతదని, దీనిని 1980లలో నిర్మించారని తెలిపారు. చివరి గదిలో ఉన్న స్విచ్ బోర్డు వద్ద షార్ట్ సర్క్యూట్ అయినట్లు తెలిపారు. అక్కడి నుంచి మంటలు వ్యాపించాయని, సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది వెంటనే సంఘటన స్థలానికి చేరుకుని మంటలను ఆర్పివేశాయని అన్నారు. హైదరాబాద్‌లోని అన్ని భవనాలను తనిఖీ చేస్తామని ఆయన తెలిపారు. రెసిడెన్షియల్, కమర్షియల్ కార్యాలయాలను తనిఖీ చేస్తామని అన్నారు. ఎండాకాలం సమీపించిన నేపథ్యంలో అగ్నిప్రమాదాలు సంభవించే అవకాశం ఉందని, అగ్నిమాపక సిబ్బంది అప్రమత్తంగా ఉందని తెలిపారు.

# కేసీఆర్‌ది చెరగని దగా చరిత్ర

పరిగి: 'భారాస అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ చరిత్రను నేను చెరిపేస్తున్నానని ఆ పార్టీ నేతలు వాపోతున్నారు. కానీ ఆయన దగా చరిత్ర నేను చెరిపినా చెరగదు' అంటూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఎద్దేవా చేశారు. వికారాబాద్ జిల్లా పరిగి శివారులోని నారాయణపూర్‌లో శనివారం 'ప్రజాపాలనప్రగతి బాట' సభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. శాసనసభాపతి గడ్డం ప్రసాద్‌కుమార్, మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు తదితరులు పాల్గొన్న ఈ సభలో సీఎం మాట్లాడుతూ... దళితుణ్ని ముఖ్యమంత్రి చేస్తానని ఆ వర్గాన్ని మోసం చేసిన చరిత్రతోపాటు మూడెకరాల భూమి ఇస్తానని మాటిచ్చి తప్పి.. ఇంటికో ఉద్యోగం ఇస్తామని నిరుద్యోగ యువతను మోసం చేసిన కేసీఆర్ చరిత్రను ఎవరు మార్చగలరని ప్రశ్నించారు. రెండు పడక గదుల ఇళ్లు నిర్మించి ఇస్తామని నిరుపేదలను మోసం చేసిన చరిత్రను ఎలా తొలగించగలమని అన్నారు.

### పెళ్లి పెద్దను చూసి పిల్లనివ్వగలమా?

"అసెంబ్లీ, లోక్‌సభ, పంచాయతీ ఎన్నికల్లో ఓటమి పాలైన భారాస.. దొంగచాటుగా పురపాలికల ఎన్నికల్లో విజయం సాధించేందుకు భాజపాతో చీకటి ఒప్పందం చేసుకుంటోంది. ఇటీవల తాండూరుకు చెందిన భాజపా నేతలు కాంగ్రెస్‌లో చేరిన సమయంలో ఆ పార్టీ నేతలే స్వయంగా తమ పార్టీ టికెట్లను భారాస కార్యాలయాల్లో జారీ చేస్తున్నారని చెప్పారు. దీన్నిబట్టే ఆ రెండు పార్టీల కుమ్మక్కు బయటపడుతోంది. భాజపా నాయకులు మున్సిపల్ ఎన్నికల్లో కూడా ప్రధాని మోదీని చూసి ఓట్లేయాలని అడుగుతున్నారు. పెళ్లి పెద్దను చూసి పిల్లనిస్తే సంసారం ఆగమవుతుంది. పెళ్లికొడుకు గుణాలు చూసి పిల్లనిస్తేనే కాపురం బాగుంటుంది. మోదీని చూసి ఓటేస్తే స్థానిక సమస్యలు ఎలా పరిష్కారమవుతాయి? దిల్లీలో యమునా రివర్ ఫ్రంట్ పేరిట యమునా నదిని, గుజరాత్‌లో సబర్మతి, ఉత్తర్‌ప్రదేశ్‌లో గంగా నదిని భాజపా ప్రభుత్వాలు శుద్ధి చేశాయి. ఇక్కడ మూసీ నదిని ప్రక్షాళన చేస్తామంటే భాజపా, భారాస నాయకులు మోకాలడ్డుతున్నారు. ఐదేళ్లు పరిపాలించేందుకు ప్రజలు కాంగ్రెస్‌కు అధికారం ఇస్తే.. భారాస, భాజపా నాయకులు మమ్మల్ని రెండేళ్లు పూర్తికాగానే దిగిపొమ్మంటున్నారు. వారికి సవాల్ విసురుతున్నా.. మిగిలి ఉన్న మూడేళ్లతో పాటు మరో ఐదేళ్లు.. అంటే వచ్చే ఎనిమిదేళ్లు రాష్ట్రంలో ఇందిరమ్మ పాలనే ఉంటుంది. ఎవరెన్ని కుట్రలు చేసినా ప్రజల ఆశీర్వాదంతో కాంగ్రెస్‌దే విజయం.

### నారాయణపూర్ సభకు హాజరైన జనం

మా ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక నిరుద్యోగ యువతకు 70 వేల ఉద్యోగాలిచ్చాం. 15 ఏళ్ల తర్వాత గ్రూప్1 ఉద్యోగాలు భర్తీ చేశాం. బీసీలు, దళితులు, గిరిజనులు, ఆదివాసీలకు గ్రూప్1 ఉద్యోగాలు వస్తే జీర్ణించుకోలేక కొందరు కోర్టుల్లో కేసులు వేశారు. ఇంటికో ఉద్యోగం ఇస్తానని చెప్పిన కేసీఆర్.. ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేయకుండా నిరుద్యోగుల జీవితాలతో చెలగాటమాడారు. రూ.లక్ష కోట్ల ప్రజాధనంతో నిర్మించిన కాళేశ్వరం మూడేళ్లలోనే కూలేశ్వరంగా మారింది. దోపిడీ చేసిన నిధులతో ఎర్రవల్లిలో కేసీఆర్, జన్వాడలో కేటీఆర్, శంకర్‌పల్లిలో కవిత, మొయినాబాద్‌లో హరీశ్‌రావులు ఫాంహౌస్‌లు నిర్మించుకున్నారు. ఉమ్మడి రంగారెడ్డి జిల్లాపై కేసీఆర్ కక్ష సాధింపు గోదావరిలో ఏటా 3 వేల టీఎంసీలు వృథాగా పోతున్నాయని భారాస అధినేత కేసీఆర్ స్వయంగా అసెంబ్లీలో పవర్ పాయింట్ ప్రజంటేషన్ ఇచ్చి చెప్పారు. ఆంధ్రాలో శ్రీకాకుళం నుంచి నెల్లూరు వరకు గోదావరి జలాలను తరలించుకోవాలని ఏపీకి సూచించారు. ఏపీ మాజీ మంత్రి రోజా ఇంట్లో భోజనం చేస్తూ రాయలసీమను గోదావరి జలాలతో సస్యశ్యామలం చేసుకోవాలని కేసీఆర్ సలహా ఇచ్చారు. ఉమ్మడి రాష్ట్రంలో సమైక్య పాలకులు ప్రతిపాదించిన ప్రాణహిత చేవెళ్ల పనులను వికారాబాద్ వరకు పొడిగించాలని నిర్దేశించినా.. ఉమ్మడి రంగారెడ్డి జిల్లాపై కక్షతో కేసీఆర్ ఆ పనులను పక్కన పెట్టారు. 300 టీఎంసీల గోదావరి జలాలను రంగారెడ్డికి తరలిస్తే సస్యశ్యామలం అయ్యేది. రాష్ట్రం అంతటికీ వడ్డించేది.. సమకూర్చేది మేమే కాబట్టి పుర ఎన్నికల్లో పొరపాటున ఇతర పార్టీలకు ఓటేస్తే ఇబ్బందులొస్తాయి.

# క్వాంటమ్ విప్లవానికి మనదే నాయకత్వం.. ఇది చారిత్రక ఘట్టం

"ఇది కేవలం అమరావతికో, ఆంధ్రప్రదేశ్‌కో సంబంధించిన రోజు కాదు. యావత్ భారతదేశ చరిత్రలో ఇదొక చారిత్రక దినం. గతంలో మనం వ్యవసాయ, పారిశ్రామిక విప్లవాలను అందిపుచ్చుకోలేకపోయాం. కానీ, కమ్యూనికేషన్, ఐటీ విప్లవంలో వేగంగా అడుగులు వేశాం. ఇప్పుడు ప్రపంచం ముందున్న క్వాంటమ్ విప్లవంలో మనం అనుసరించడం కాదు, ఏకంగా నాయకత్వం వహించబోతున్నాం. ఆ మహాయజ్ఞానికి అమరావతి నుంచే పునాది వేస్తున్నాం" అని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. అమరావతి భవిష్యత్తును, తద్వారా దేశ సాంకేతిక ప్రగతిని నిర్దేశించే 'క్వాంటమ్ వ్యాలీ' భవన నిర్మాణానికి శనివారం కేంద్ర శాస్త్ర, సాంకేతిక శాఖ మంత్రి జితేంద్ర సింగ్‌తో కలిసి ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో చంద్రబాబు తన దార్శనికతను, భవిష్యత్ ప్రణాళికలను ఆవిష్కరించారు. ఆనాటి రోజులను గుర్తు చేసుకున్న చంద్రబాబు, "1995లో నేను ముఖ్యమంత్రి అయినప్పుడు బిల్ గేట్స్ ఇంటర్నెట్‌ను ఆవిష్కరించారు. అప్పుడు దాని ప్రాముఖ్యతను గుర్తించి రాష్ట్రాన్ని ఆ దిశగా నడిపించా. మాజీ ప్రధాని వాజ్‌పేయి గారు టెలికమ్యూనికేషన్ రంగంలో సంస్కరణలు తీసుకురావడం, నేను హైటెక్ సిటీని ప్రారంభించడం దేశ ఐటీ రంగంలో గేమ్ ఛేంజర్‌గా నిలిచాయి. ఆనాడు వాజ్‌పేయి గారు హైటెక్ సిటీని ప్రారంభిస్తే, నేడు క్వాంటమ్ వ్యాలీకి ఇక్కడ పునాది పడింది. ఇది దేశానికే మరో గేమ్ ఛేంజర్ అవుతుంది. ఈ చరిత్రలో మనమందరం భాగస్వాములం" అని ఉద్వేగంగా ప్రసంగించారు.




తుళ్లూరు మండలం ఉద్దండరాయునిపాలెంలో ప్రభుత్వం కేటాయించిన 50 ఎకరాల విస్తీర్ణంలో ఈ క్వాంటమ్ వ్యాలీ రూపుదిద్దుకోనుంది. ఇది కేవలం ఒక భవనం కాదు, క్వాంటమ్ కంప్యూటింగ్, క్వాంటమ్ కమ్యూనికేషన్స్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, సైబర్ సెక్యూరిటీ, రక్షణ, ఆరోగ్యం, ఆర్థిక రంగాల్లో పరిశోధనలు, ఆవిష్కరణలకు కేంద్రంగా మారనుంది. వచ్చే 40 ఏళ్ల అవసరాలను దృష్టిలో పెట్టుకుని ఈ ప్రాజెక్టును చేపట్టినట్లు సీఎం స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ఐబీఎం, టీసీఎస్, ఎల్ అండ్ టీ వంటి దిగ్గజ సంస్థల ప్రతినిధులను ఉద్దేశించి మాట్లాడుతూ, "భారతదేశంలోనే తొలి 133 క్యూబిట్ క్వాంటమ్ కంప్యూటర్‌ను అమరావతికి తీసుకురావాలి. ఒకటి రెండు నెలల్లో ఒప్పందాలు పూర్తిచేసి, ఈ ఏడాది చివరికల్లా తొలి క్వాంటమ్ కంప్యూటర్‌ను ఇక్కడ ఏర్పాటు చేయాలి. ఏప్రిల్ 14 నాటికి మరో రెండు క్వాంటమ్ సెంటర్లను కూడా ప్రారంభిస్తాం" అని లక్ష్యాలను నిర్దేశించారు. 2030 నాటికి రాష్ట్రంలో 2.5 లక్షల మంది క్వాంటమ్ నిపుణులను తయారు చేయాలనే బృహత్ ప్రణాళికను ఆయన వివరించారు. అమరావతిని ప్రపంచ పటంలో నిలపాలన్న తన సంకల్పానికి బలం చేకూరుస్తూ, మైక్రోసాఫ్ట్ వ్యవస్థాపకుడు బిల్ గేట్స్ ఈ నెల 16న అమరావతికి రానున్నట్లు చంద్రబాబు ప్రకటించడం సభలో హర్షాతిరేకాలు రేపింది. దేశంలోని ఐటీ నిపుణుల్లో 35 శాతం మంది తెలుగువారేనని గుర్తు చేస్తూ, వారి ప్రతిభను రాష్ట్ర భవిష్యత్తు కోసం వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్, రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్, మంత్రులు నారాయణ, కందుల దుర్గేశ్, ఐఐటీ, టీసీఎస్, ఐబీఎం, ఎల్ అండ్ టీ సంస్థల ఉన్నతాధికారులు, విద్యావేత్తలు, విద్యార్థులు పాల్గొన్నారు. ఈ శంకుస్థాపన, ఆంధ్రప్రదేశ్‌ను భవిష్యత్ సాంకేతిక హబ్‌గా మార్చే ప్రయాణంలో ఒక మైలురాయిగా నిపుణులు అభివర్ణిస్తున్నారు.

## త్వరలోనే మలేషియాలో
# తొలి భారత కాన్సులేట్... ప్రధాని మోదీ ప్రకటన

భారత్, మలేషియా మధ్య ద్వైపాక్షిక సంబంధాలను మరింత బలోపేతం చేసే దిశగా ప్రధాని నరేంద్ర మోదీ కీలక ప్రకటన చేశారు. మలేషియాలో త్వరలోనే తొలి భారత కాన్సులేట్‌ను ప్రారంభించనున్నట్లు వెల్లడించారు. శనివారం కౌలాలంపూర్‌లో జరిగిన 'సెలామత్ దతాంగ్ మోదీజీ' కార్యక్రమంలో ఆయన ఈ ప్రకటన చేశారు. ఈ కార్యక్రమానికి మలేషియా ప్రధాని అన్వర్ ఇబ్రహీంతో కలిసి మోదీ హాజరయ్యారు. కాన్సులేట్ ఏర్పాటు నిర్ణయంతో ఇరు దేశాల మధ్య బంధం మరింత బలపడుతుందని ప్రధాని మోదీ తన ఎక్స్ (ట్విట్టర్) ఖాతాలో పేర్కొన్నారు. ఈ చొరవతో మలేషియాలోని భారతీయ సమాజంతో సంబంధాలు మరింత విస్తృతం అవుతాయని భారత విదేశాంగ శాఖ (MEA) తెలిపింది. ప్రధాని ప్రకటనపై అక్కడి ప్రవాస భారతీయులు హర్షం వ్యక్తం చేశారు. అంతకుముందు ఆరో తరం వరకు ఉన్న మలేషియాలోని భారత సంతతి పౌరులకు ఓవర్సీస్ సిటిజన్‌షిప్ ఆఫ్ ఇండియా (OCI) కార్డుల అర్హతను పొడిగించడంపై ప్రవాస భారతీయులు సంతోషంగా ఉన్నారని మోదీ తెలిపారు. ఈ సందర్భంగా మోదీ మాట్లాడుతూ, మలేషియా అభివృద్ధికి, ఇరు దేశాల స్నేహాన్ని బలోపేతం చేయడంలో భారత సంతతి ప్రజల పాత్రను కొనియాడారు. భారత్‌మలేషియా భాగస్వామ్యాన్ని ఆయన 'ఇంపాక్ట్' (IMPACT - India Malaysia Partnership For Advancing Collective Transformation)గా అభివర్ణించారు. ఆజాద్ హింద్ ఫౌజ్ చరిత్రను గుర్తుచేసుకుంటూ నేతాజీ సుభాష్ చంద్రబోస్‌కు నివాళులర్పించారు. ఆహారపు అలవాట్ల నుంచి భాష వరకు ఇరు దేశాల మధ్య అనేక సాంస్కృతిక సారూప్యతలు ఉన్నాయని గుర్తుచేశారు. ఈ పర్యటనలో భాగంగా మరికొన్ని కీలక ప్రకటనలు కూడా చేశారు. కౌలాలంపూర్‌లోని యూనివర్సిటీ మలయాలో ప్రత్యేకంగా 'తిరువళ్లువార్ సెంటర్' ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించారు. దీంతో పాటు విద్యార్థుల కోసం తిరువళ్లువార్ స్కాలర్‌షిప్‌లను కూడా అందిస్తామని హామీ ఇచ్చారు. భారత్ ఆర్థికంగా వేగంగా అభివృద్ధి చెందుతోందని, త్వరలోనే యూపీఐ చెల్లింపుల సౌకర్యం మలేషియాలోనూ అందుబాటులోకి వస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా 800 మంది కళాకారులతో ప్రదర్శించిన భారత సంప్రదాయ నృత్య ప్రదర్శన మలేషియన్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో స్థానం సంపాదించడం విశేషం.

# అక్రిడిటేషన్ కార్డుల జారీకి ఆన్‌లైన్ దరఖాస్తులు ఆహ్వానం

* **జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్.**
* **ఈ నెల 9 నుండి ఆన్లైన్ లో దరఖాస్తులు సమర్పించాలి**



ప్రజా స్ఫూర్తి,భద్రాద్రి కొత్తగూడెం: సమాచార పౌరసంబంధాల శాఖ ఆధ్వర్యంలో 2026-28 సంవత్సరానికి జర్నలిస్టుల అక్రిడిటేషన్ కార్డుల జారీ కోసం ఆన్‌లైన్ దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా అక్రెడిటేషన్ కమిటీ చైర్మన్, జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ తెలిపారు. ప్రస్తుతం అమల్లో ఉన్న అక్రిడిటేషన్ కార్డుల కాలపరిమితి గడువు ఫిబ్రవరి 28తో ముగియనున్నందున అర్హత కలిగిన జర్నలిస్టులకు కొత్త అక్రిడిటేషన్ కార్డులు జారీ చేయనున్నట్లు తెలిపారు. జిల్లా స్థాయి అక్రిడిటేషన్ కార్డుల కోసం మీడియా యాజమాన్యాలు తమ జర్నలిస్టుల పేర్ల జాబితాను జిల్లా పౌరసంబంధాల అధికారి నకు సమర్పించాలన్నారు. యాజమాన్యాల ద్వారా పంపిన పేర్లలో ఉన్న జర్నలిస్టులు సమాచార పౌరసంబంధాల శాఖ అధికారిక వెబ్ సైట్ http://ipr.telangana.gov.in ద్వారా ఆన్ లైన్ లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.జిల్లా స్థాయిలలో ఆన్ లైన్ దరఖాస్తులను ఫిబ్రవరి 9 నుండి సమర్పించాలని, అర్హులైన జర్నలిస్టులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్ ప్రకటనలో పేర్కొన్నారు.

## కమ్యూనిస్టుల గెలుపు
# అభివృద్ధికి మలుపు

: **డా. కె. నారాయణ**



ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: కొత్తగూడెం కార్పొరేషన్ ఎన్నికల్లో కమ్యూనిస్టు పార్టీ అభ్యర్థులను గెలిపిస్తే అభివృద్ధి శరవేగంగా జరుగుతుందని సిపిఐ జాతీయ నేత డా. కె. నారాయణ తెలిపారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా రామవరం, బర్మా క్యాంపు, వ్యాన్ బస్తీ, పాత కొత్తగూడెం ప్రాంతాల్లో జరిగిన రోడ్డు, బస్తీ కార్నర్ సమావేశాల్లో ఆయన పాల్గొన్నారు.ఈ సందర్భంగా ప్రజలు ఎర్రజెండాలతో స్వాగతం పలికి నినాదాలతో ప్రచారాన్ని ఉత్సాహంగా నిర్వహించారు. కమ్యూనిస్టులు ఎప్పుడూ ప్రజల సమస్యల కోసం పోరాడుతారని, ఆత్మగౌరవాన్ని గెలిపించుకోవాలంటే సిపిఐ అభ్యర్థులను గెలిపించాలని నారాయణ కోరారు. కార్పొరేషన్ పాలనలో పారదర్శకత, అవినీతి రహిత పాలన కోసం ఎర్రజెండా అభ్యర్థుల విజయం అవసరమన్నారు.ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర నేత భా. హేమంతరావు, జిల్లా కార్యదర్శి ఎస్.కే. సాబీర్ పాషా, ఇతర నాయకులు, అభ్యర్థులు పాల్గొన్నారు.

## సిఐఎస్ఎఫ్ యూనిట్ ఎన్ ఎఫ్ సి
# హైదరాబాద్‌లో ఆర్ట్ ఆఫ్ లివింగ్ కార్యక్రమం ముగింపు

ప్రజాస్ఫూర్తి , కాప్రా : సిఐఎస్ఎఫ్ సిబ్బంది కోసం భారత ప్రభుత్వం జారీ చేసిన మార్గదర్శకాల మేరకు సిఐఎస్ఎఫ్ యూనిట్ ఎన్ ఎఫ్ సి హైదరాబాద్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఆర్ట్ ఆఫ్ లివింగ్ ఒత్తిడి నిర్వహణ సమగ్ర శ్రేయస్సు కార్యక్రమం శుక్రవారం విజయవంతంగా ముగిసింది. డిఏఈ 1 డిఏఈII పరిధిలోని వివిధ సిఐఎస్ఎఫ్ యూనిట్ల నుంచి మొత్తం 80మంది సిఐఎస్ఎఫ్ సిబ్బంది ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. హైదరాబాద్‌కు చెందిన ఆర్ట్ ఆఫ్ లివింగ్ ఫ్యాకల్టీ సభ్యులు సంతోష్, డాక్టర్ షీల్ పరేఖ్, ప్రణయ్ కుమార్ నాయుడు మరియు దీపిక సెషన్‌లను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కమాండెంట్ రాహుల్ సింగ్ గౌతమ్, డిప్యూటీ కమాండెంట్ జై శంకర్ సింగ్ ,పెరి లక్ష్మి, హాజరయ్యారు. సవాలుతో కూడిన విధులను నిర్వహిస్తున్న దళ సిబ్బంది అవసరాలను దృష్టిలో ఉంచుకుని, ఒత్తిడి నిర్వహణ, శారీరక దృఢత్వం, ధ్యానం, యోగా అంశాలపై ప్రత్యేక సెషన్‌లు మరియు ప్రాయోగిక కార్యకలాపాలు నిర్వహించబడ్డాయి. ఈ సెషన్‌లు దళ సిబ్బంది యొక్క వృత్తిపరమైన మరియు వ్యక్తిగత జీవితాలలో సమతుల్యత, మానసిక శ్రేయస్సు మరియు క్రమశిక్షణను పెంపొందించడంపై దృష్టి సారించాయి.ఈ కార్యక్రమం ద్వారా పాల్గొన్న సిబ్బంది మానసిక స్థైర్యం, సామర్థ్యం పనితీరు మెరుగుపడుతాయని అధికారులు తెలిపారు. భవిష్యత్తులో ఇటువంటి శ్రేయస్సు కార్యక్రమాలను మరింత విస్తృతంగా నిర్వహించనున్నట్లు వెల్లడించారు.

## విమానంలో..
# ముంబయి నుంచి ఓటర్లు..!

యాదాద్రి : యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ పురపాలికలోని తాళ్లసింగారం, తంగడపల్లి గ్రామాల్లో సుమారు 150 మంది ఓటర్లు ఉపాధి కోసం ముంబయి వెళ్లారు. వీరిని ప్రసన్నం చేసుకునేందుకు కౌన్సిలర్ పదవికి పోటీ చేస్తున్న అభ్యర్థులు.. ఎన్నికల షెడ్యూలు ప్రకటించగానే తమ వార్డు ఓటరు జాబితాతో ముంబయి బయలుదేరారు. అక్కడి తమ అనుయాయుల సహకారంతో ఊరి వారి ఇళ్లకు వెళ్లి తమకు మద్దతివ్వాలని కోరారు. ఓటు కోసం ఊరికి వచ్చి వెళ్లేందుకు విమానం, రైలు, బస్సు.. ఎందులో వచ్చినా దారి ఖర్చులు భరిస్తామని హామీ ఇచ్చి వచ్చారు. కొందరు ముఖ్యులు విమానంలో వస్తామన్నారు. ప్రస్తుతంటికెట్లు బుక్ చేస్తున్నారు. ఇప్పటికే తంగడపల్లికి కొందరు ఓటర్లు చేరుకున్నారు. చౌటుప్పల్ పురపాలిక అన్ని వార్డుల ఓటర్లు హైదరాబాద్‌లో వందల సంఖ్యలో ఉన్నారు. వారిని రప్పించేందుకు ప్రత్యేక బృందాలను నియమించారు.

# సాయి లత మోడల్ హై స్కూల్ లో ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన






(ప్రజాస్ఫూర్తి, కుత్బుల్లాపూర్) : షాపూర్ నగర్ లోని సంజయ్ గాంధీ నగర్ లోని సాయి లత మోడల్ హై స్కూల్ లో ఏర్పాటుచేసిన ఉచిత వైద్య ఆరోగ్య శిబిరానికి విశేష స్పందన లభించింది. సూరారం లోని మల్లారెడ్డి ఆసుపత్రి వైద్యుల సౌజన్యంతో లయన్స్ క్లబ్ ఆఫ్ సికింద్రాబాద్ నార్త్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఉచిత శిబిరాన్ని నిర్వహించారు. జనరల్, గుండె, కంటి, దంత, స్త్రీ వైద్య నిపుణులతో పాటు అన్ని రకాల వైద్య పరీక్షలను చేశారు. వైద్య పరీక్షలు చేసిన అనంతరం ఉచితంగా మందులను పంపిణీ చేశారు. అవసరమైన వారికి ఆపరేషన్లు చేపడతామని వైద్య నిపుణులు తెలిపారు. లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఆరోగ్య శిబిరాలకు విశేష స్పందన రావడం సంతోషంగా ఉందని లయన్స్ క్లబ్ సికింద్రాబాద్ నార్త్ అధ్యక్షులు బిరు ఆంజనేయులు తెలిపారు. సామాజిక సేవా కార్యక్రమాలలో తాము ఎప్పుడు ముందుంటామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో సాయి లతా మోడల్ హై పాఠశాల కరస్పాండెంట్ అర్చన, ప్రిన్సిపాల్, లయన్స్ క్లబ్ ఆఫ్ సికింద్రాబాద్ నార్త్ ప్రధాన కార్యదర్శి జనార్ధన్ దయాకర్, లయన్స్ క్లబ్ ప్రతినిధులు సిహెచ్ నరసింహులు గౌడ్, భాష, సంజయ్ గాంధీనగర్ బస్తీ నాయకులు లక్ష్మీనారాయణ, రాజలింగం, భద్రప్ప, విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# కాలనీ సమస్యల పరిష్కారానికి తప్పకుండా కృషి చేస్తా

* **ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి**

ప్రజాస్ఫూర్తి , కాప్రా : డా ఏ ఎస్ రావు నగర్ డివిజన్ పరిధిలోని కాలనీల్లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి తప్పకుండా కృషి చేస్తానని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి తెలిపారు.శనివారం డా ఏ ఎస్ రావు నగర్ డివిజన్‌లో సుమారు రూ.14 కోట్ల నిధులతో చేపట్టనున్న పలు అభివృద్ధి కార్యక్రమాలకు ఎమ్మెల్యే స్థానిక కార్పొరేటర్ శిరీష సోమ శేఖర్ రెడ్డితో కలిసి శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా చేపట్టనున్న అభివృద్ధి పనులు వివిధ కాలనీల్లో సీసీ రోడ్ల నిర్మాణం, దెబ్బతిన్న బీటీ రోడ్ల మరమ్మతులు , రీ-కార్పెటింగ్, అనుపురం కాలనీ, భవానీ నగర్, శ్రీనగర్ కాలనీ తదితర ప్రాంతాల్లో రోడ్డు అభివృద్ధి, భవానీ నగర్ రోడ్ నుంచి ఈటిడిసి వరకు ఆర్సీసీ బాక్స్ డ్రెయిన్ నిర్మాణం, శాంతివనం శ్మశానవాటిక అభివృద్ధి పనులు చేపట్టనున్నారు. అలాగే మహేశ్ నగర్ గ్రౌండ్, విరాట్ నగర్ పార్కులో వాకింగ్ ట్రాక్, చైన్ లింక్ ఫెన్సింగ్, ఇతర పార్క్ సౌకర్యాలు ఏర్పాటు చేయనున్నారు. దక్షిణ కమల నగర్‌లో కంపౌండ్ వాల్ మరమ్మతులు, ఓపెన్ జిమ్, బతుకమ్మ మడుగు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఈ అభివృద్ధి పనుల ద్వారా వార్డు-పదిహేను పరిధిలో మౌలిక సదుపాయాలు మరింత మెరుగుపడనున్నాయని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు సోమ శేఖర్ రెడ్డి, మాజీ కార్పొరేటర్ కొత్త రామారావు, బిఆర్ఎస్ పార్టీ డివిజన్ అధ్యక్షుడు మహిపాల్ రెడ్డి, పార్టీ నాయకులు, కార్యకర్తలు, అధికారులు తదితరులు పాల్గొన్నారు




# విద్యావంతురాలు కె.సాహితి ప్రచారం జోరు

* **15వ డివిజన్‌లో ఇంటింటికి ప్రచారం**
* **సీపీఐ అభ్యర్థికి టిడిపి, బిఆర్ ఎస్, ప్రజాసంఘాల మద్దతు**

ప్రజా స్ఫూర్తి,భద్రాద్రి కొత్తగూడెం: కొత్తగూడెం కార్పొరేషన్ ఎన్నికల నేపథ్యంలో 15వ డివిజన్‌లో సీపీఐ పార్టీ అభ్యర్థి కనుకుంట్ల సాహితి ప్రచారాన్ని జోరుగా కొనసాగిస్తున్నారు. డివిజన్‌లోని కాలనీలు, బస్తీల్లో ఇంటింటికి తిరుగుతూ ఓటర్లను కలిసి మద్దతు కోరుతున్నారు. ఆమెను భారీ మెజార్టీతో గెలిపించాలని టిడిపి పార్టీతో పాటు పలు ప్రజాసంఘాలు బలపరిచాయి. బిఆర్ ఎస్ మద్దతు తెలిపారు. కనుకుంట్ల శ్రీనివాస్, దుర్గా దంపతుల కుమార్తె అయిన సాహితి ఉన్నత విద్యను అభ్యసించారు. బీఎస్సీ (ఎంఎస్‌సీఎస్), ఎంఎస్‌డబ్ల్యూ విద్యార్హతలు కలిగిన ఆమె సామాజిక సేవపై ఆసక్తితో ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ఎన్నికల బరిలో నిలిచారు.ప్రచారంలో భాగంగా స్థానిక ప్రజల సమస్యలను తెలుసుకుంటూ మౌలిక సదుపాయాల అభివృద్ధి, విద్య, ఆరోగ్య రంగాలపై ప్రత్యేక దృష్టి సారిస్తానని హామీ ఇస్తున్నారు. యువతకు ఉపాధి అవకాశాల కల్పన, మహిళల సంక్షేమానికి కృషి చేస్తానని తెలిపారు. కంకి కొడవలి గుర్తుపై తమ అమూల్యమైన ఓటు వేసి గెలిపించాలని సాహితి ఓటర్లను కోరుతున్నారు. డివిజన్‌లో యువత, మహిళల నుంచి మంచి స్పందన లభిస్తున్నట్లు ప్రచార బృందం పేర్కొంది.

## ఎఫ్‌డీసీలో లంచం కేసు...
# డివిజనల్ మేనేజర్ అరెస్ట్

* **హార్వెస్టింగ్ పనుల్లో అక్రమాలు వెలుగులోకి**
* **మొత్తం రూ.28.80 లక్షలు డిమాండ్ ఆరోపణలు**



ప్రజా స్ఫూర్తి,భద్రాద్రి కొత్తగూడెం: ఫారెస్ట్ డెవలప్మెంట్ కార్పొరేషన్ (ఎఫ్‌డీసీ) కొత్తగూడెం డివిజన్‌లో లంచం కేసు సంచలనంగా మారింది. యూకలిప్టస్ తోటల హార్వెస్టింగ్ పనులకు సంబంధించి లంచం డిమాండ్ చేసిన కేసులో అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులు డివిజనల్ మేనేజర్ తాటి శ్రీ శ్రావణిని అరెస్ట్ చేశారు.ఫిర్యాదుదారునికి లభించిన టెండర్‌కు సంబంధించిన యూనిట్ నంబర్లు 8 నుంచి 15 వరకు మొత్తం 32,000 టన్నుల యూకలిప్టస్ చెట్ల నరికివేత పనులకు గాను ఒక్క టన్నుకు రూ.90 చొప్పున మొత్తం రూ.28,80,000 లంచం డిమాండ్ చేసినట్లు ఏసీబీ అధికారులు తెలిపారు. కేసులో భాగంగా పెనగడప గ్రామం శివార్లలోని 9వ యూనిట్‌కు చెందిన 3,900 టన్నుల చెట్ల నరికివేత పనుల బిల్లుల ఆమోదం కోసం టన్నుకు రూ.90 చొప్పున రూ.3,51,000 లంచం తీసుకుంటున్న సమయంలో ప్లాంట్ మేనేజర్ రాజేందర్, అతనికి సహకరించిన సీతాయిగూడెం నివాసి గోపాలకృష్ణను ఈ ఏడాది జనవరి 3న ఏసీబీ అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. అనంతరం వారిని అరెస్ట్ చేసి కోర్టుకు రిమాండ్ చేశారు. ప్రధాన నిందితురాలైన డివిజనల్ మేనేజర్ తాటి శ్రీ శ్రావణి అప్పటి నుంచి పరారీలో ఉండగా, విశ్వసనీయ సమాచారం మేరకు విశాఖపట్నం స్టీల్ ప్లాంట్ పరిసరాల్లో ఉన్నట్లు గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. ఆమెను శనివారం అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరిచి రిమాండ్ చేసినట్లు అధికారులు తెలిపారు.

## ఘనంగా హెచ్ఎమ్ఆర్ఏ ద్విచక్ర వాహన మెకానిక్స్ అసోసియేషన్ 3వ వార్షికోత్సవం




ప్రజాస్ఫూర్తి , కాప్రా : హైదరాబాద్-మెడ్చల్ మల్కాజిగిరి-రంగారెడ్డి జిల్లాల ద్విచక్ర వాహన మెకానిక్స్ అసోసియేషన్ హెచ్ఎమ్ఆర్ఏ 3వ వార్షికోత్సవ వేడుకలు శనివారం చెర్లపల్లి ఇండస్ట్రీస్ అసోసియేషన్ కార్యాలయ సముదాయంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఉప్పల్ నియోజకవర్గ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి హాజరై సంఘ సభ్యులను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ద్విచక్ర వాహన మెకానిక్స్ సమాజ అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్నారని, వారి సమస్యల పరిష్కారానికి తనవంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో హెచ్ఎమ్ఆర్ఏ సంఘ నాయకులు మరియు సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. సంఘం 3వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని పలు కార్యక్రమాలు నిర్వహించగా, సభ్యులు ఉత్సాహంగా పాల్గొన్నారు.కార్యక్రమం ముగింపులో ముఖ్య అతిథిని శాలువాతో సత్కరించి జ్ఞాపికను అందజేశారు. అలాగే ఇటీవల కరెంట్ షాక్‌తో మృతి చెందిన ఒక మెకానిక్ కుటుంబానికి సంఘం తరపున రూ.4 లక్షల రూపాయల చెక్కును అందజేశారు.ఈ కార్యక్రమంలో పలువురు సంఘ నాయకులు, ద్విచక్ర వాహన మెకానిక్స్ , ఇతరులు పాల్గొన్నారు.

## గౌతమ్ నగర్ డివిజన్ సమగ్ర అభివృద్ధికి నిరంతరం కృషి

* **గౌతమ్ నగర్ డివిజన్ కార్పొరేటర్ మేకల సునీత రాము యాదవ్**



మల్కాజిగిరి, ప్రజాస్ఫూర్తి: గౌతమ్ నగర్ డివిజన్ సమగ్ర అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్నానని మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యత ఇస్తున్నానని గౌతమ్ నగర్ డివిజన్ కార్పొరేటర్ మేకల సునీత రాము యాదవ్ పేర్కొన్నారు. గౌతమ్ నగర్ డివిజన్ పరిధిలోని ఇందిరా నెహ్రూ నగర్ మూడు కమాన్ల వద్ద 42 లక్షల రూపాయలతో డ్రైన్ బాక్స్ నిర్మాణ పనులను ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి ఆదేశాల మేరకు శుక్రవారం ప్రారంభించామని తెలిపారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మేకల సునీత రాము యాదవ్ మాట్లాడుతూ గౌతమ్ నగర్ డివిజన్ పరిధిలోని గత ఐదు సంవత్సరాల కాలంగా అన్ని కాలనీలలో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తానని తెలిపారు కార్యక్రమంలో అధికారులు బి ఆర్ ఎస్ నాయకులు కార్యకర్తలు మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఎక్స్‌అఫీషియో ఓటింగ్‌లో గత తీర్పును అమలు చేయండి: హైకోర్టు

హైదరాబాద్: మున్సిపల్ ఎన్నికలకు సంబంధించి చైర్మన్, వైస్‌చైర్మన్‌ల ఎన్నికలో ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు ఉన్న ఎక్స్‌అఫీషియో ఓటింగ్ విషయంలో గతంలో ఇదే న్యాయస్థానం ఇచ్చిన మార్గదర్శకాలను అమలు చేయాలని హైకోర్టు ప్రభుత్వానికి సూచించింది. లోక్‌సభ సభ్యులు, ఎమ్మెల్యేలు వారి నియోజకవర్గాల పరిధిలోను.. రాజ్యసభ సభ్యులు, ఎమ్మెల్సీలు వాళ్లకు ఓటుహక్కున్న మున్సిపాలిటీల్లోను.. తమ ఎక్స్ అఫీషియో ఓటుహక్కును వినియోగించుకోవాలంటూ గతంలో హైకోర్టు డివిజన్ బెంచ్ ఇచ్చిన ఆదేశాలను అమలు చేయాలని స్పష్టం చేసింది. ఎక్స్ అఫీషియో ఓటింగ్ మున్సిపాలిటీని ఎంచుకోవాలంటూ నిర్మల్ కలెక్టర్ ప్రజాప్రతినిధులకు లేఖ రాయడాన్ని సవాల్ చేస్తూ కె.నరేందర్ దాఖలు చేసిన పిటిషన్‌పై జస్టిస్ ఎన్.వి.శ్రవణ్‌కుమార్ విచారణ చేపట్టారు.

# మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ దే విజయం

* రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖా మంత్రి సి.దామోదర్ రాజనర్సింహ
* జోగిపేటలో విస్తృతంగా ఎన్నికల ప్రచారం



అందోలు, ప్రజాస్ఫూర్తి: రాష్ట్రంలో అత్యధిక మున్సిపాలిటీలు కాంగ్రెస్ పార్టీ గెలుచుకోవడం ఖాయమని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖా మంత్రి సి.దామోదర్ రాజనర్సింహ అన్నారు. మున్సిపల్ ఎన్నికల సందర్భంగా అందోలు-జోగిపేట మున్సిపాలిటీ పరిధిలోని పలు వార్డుల్లో ప్రచారాన్ని నిర్వహించారు. మూడేళ్ల పాటు రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వమే అధికారంలో ఉంటుందని కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపించుకుంటేనే అభివృద్ధి చెందుతుందన్నారు. నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు అందోలు మండలం పరిధిలోని సంగుపేట, మాసానిపల్లి ప్రాంతాల్లో నాలుగు కంపెనీలను ఏర్పాటు చేయిస్తానని మంత్రి హామీ ఇచ్చారు. రజకులు స్వయం ఉపాధి కోసం డ్రైక్లీనింగ్ సెంటర్ ఏర్పాటుకు రూ.6 లక్షల రూపాయలు ఇస్తానని ప్రకటించారు. నేపాల్ నుంచి వచ్చి ఇక్కడే పనిచేసుకొని జీవిస్తున్న కుటుంబాలకు కూడా అండగా ఉంటానని హామీ ఇచ్చారు. జోగిపేటలో మైనార్టీల కోసం రూ3 కోట్లతో బహద్దూర్ ఖాన్ ఫంక్షన్ హాలు నిర్మాణం చేపడతామన్నారు. రాజ రాజేశ్వర దేవాలయం మీదుగా బైపాస్‌రోడ్డు వరకు రోడ్డు నిర్మాణం చేపట్టనున్నట్లు తెలిపారు. ప్రజలు కార్పోరేట్ ఆసుపత్రుల వైపు చూడకుండా గాంధీ, నిమ్స్ వంటి ఆసుపత్రుల్లో మెరుగైన సేవలను పొందాలన్నారు. మెజారిటీ మున్సిపల్ చైర్మన్ పదవులను కైవసం చేసుకొని పట్టణ ప్రాంతాలను ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతామని పేర్కొన్నారు. అందోలు-జోగిపేట మున్సిపాటీ పరిధిలోని 20 వార్డుల్లో కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించాలని మంత్రి కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న ఆరు గ్యారెంటీలే పార్టీకి శ్రీరామరక్ష అని మంత్రి అన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని చక్కదిద్దుతూనే పేద, బడుగు, బలహీనవర్గాల అభివృద్ధికి సంక్షేమ పథకాలను అమలు చేస్తామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటికే ఇందిరమ్మ ఇల్లు ఇవ్వడం జరిగిందని, ప్లాట్లు లేని వారికి కూడా ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేసి వారికి సొంతింటి కల నెరవేరుస్తామని తెలిపారు. అదేవిధంగా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, జీరో వడ్డీకి రుణాలు ఇచ్చి మహిళలను ఆర్థికంగా అభివృద్ధి చేస్తున్నామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి సంక్షేమ పథకాలకు ప్రజలు ఆకర్షితులై మున్సిపల్ ఎన్నికల్లో ప్రజలు పట్టం కట్టేందుకు సిద్ధంగా ఉన్నారని పేర్కొన్నారు. మాజీ మున్సిపల్ చైర్మన్ జి.మల్లయ్య, జిల్లా గ్రంధాలయ సంస్థ చైర్మన్ అంజయ్య, మాజీ కౌన్సిలర్లు ఆకుల చిట్టిబాబు ముదిరాజ్, సురేందర్‌గౌడ్, సురేష్, డి.శంకర్‌లతో పాటు పలువురు పాల్గొన్నారు



## బాబోజి తండ పరిధిలో సేవా కార్యక్రమాలు

ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం:లక్ష్మీదేవిపల్లి మండలం బాబోజి తండ గ్రామపంచాయతీ పరిధిలోని కొత్తూరు గ్రామంలో కొంగర పురుషోత్తం రావు, రామచంద్రరావు కుటుంబ సభ్యుల ఆర్థిక సహకారంతో రూ.1.50 లక్షల వ్యయంతో నూతన అంగన్వాడి కేంద్రం నిర్మించారు.అలాగే మునియా తండా, సూర్య తండా అంగన్వాడి కేంద్రాలను రూ.1 లక్ష వ్యయంతో పునర్నిర్మించారు. చేతన ఫౌండేషన్ సహకారంతో నిరుపేద గిరిజన మహిళలకు కుట్టు మిషన్లు ఉచితంగా పంపిణీ చేశారు.కార్యక్రమానికి జిల్లా సంక్షేమ అధికారి స్వర్ణలత లెలినా, ఎంఈఓ కృష్ణయ్య, సీడీపీఓ లక్ష్మీ ప్రసన్న, చేతన ఫౌండేషన్ సభ్యుడు దొడ్డ సీతారామయ్య, కొల్లి ఫౌండేషన్ చైర్మన్ కల్పనా చౌదరి, సెక్టర్ సూపర్వైజర్ శారద, సర్పంచ్ హాతి రాం, ఉపసర్పంచ్ చందురాణి, ఉపాధ్యాయులు పద్మావతి, రాణి, గ్రామ పెద్దలు సారయ్య, సమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.గ్రామీణ ప్రాంతాల్లో చిన్నారుల విద్య, మహిళల ఉపాధి, గిరిజన అభివృద్ధికి ఇటువంటి కార్యక్రమాలు దోహదపడతాయని అధికారులు తెలిపారు.

## ఆడబిడ్డగా ఆశీర్వదించండి కాంగ్రెస్ అభ్యర్థి సుప్రియ



ప్రజా స్ఫూర్తి,భద్రాద్రి కొత్తగూడెం: కొత్తగూడెం కార్పొరేషన్ ఎన్నికల ప్రచారంలో భాగంగా 15వ డివిజన్ కాంగ్రెస్ అభ్యర్థి ఆకునూరి సుప్రియ ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తమ ఆడబిడ్డగా ప్రజల ముందుకు వస్తున్నానని, ఆశీర్వదించి గెలిపించాలని కోరారు.మహిళలతో కలిసి డివిజన్‌లో విస్తృతంగా పర్యటించిన ఆమె ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధిని ప్రజలు గుర్తిస్తున్నారని పేర్కొన్నారు. కార్పొరేషన్ ఎన్నికల్లో కాంగ్రెస్, సీపీఎం మద్దతుతో బరిలో ఉన్న తనను భారీ మెజార్టీతో గెలిపించాలని ఓటర్లను సుప్రియ కోరారు.

## ఫిబ్రవరి 12న జరిగే దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలి

* సిఐటియు కుత్బుల్లాపూర్ మండల కన్వీనర్ కీలుకాని లక్ష్మణ్



జీడిమెట్ల, ప్రజాస్ఫూర్తి : ఫిబ్రవరి 12న జరిగే దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని సిఐటియు కుత్బుల్లాపూర్ మండల కన్వీనర్ కీలుకాని లక్ష్మణ్ పిలుపునిచ్చారు. శనివారం జీడిమెట్ల పారిశ్రామిక ప్రాంతం షాపూర్ నగర్ లో సిఐటియు ఆధ్వర్యంలో కరపత్రాల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న సిఐటియు కుతుబుల్లాపూర్ మండల కన్వీనర్ కీలుకాని లక్ష్మణ్ మాట్లాడుతూ 2026 ఫిబ్రవరి 12న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెకు కేంద్ర బిజెపి ప్రభుత్వ అనుకూల కార్మిక సంస్థ బిఎంఎస్ మినహా మిగిలిన కేంద్ర కార్మిక సంఘాలు సమ్మెను బలపరుస్తూ గ్రామీణ బందుకు వ్యవసాయ కార్మిక సంఘాలు సంయుక్త కిసాన్ మోర్చా సన్నద్ధమవుతున్నాయని తెలిపారు. కేంద్రంలో బిజెపి నరేంద్ర మోడీ ప్రభుత్వం కార్పొరేట్ అనుకూల ప్రభుత్వం విధానాలపై కార్మిక వర్గం తిరుగుబాటు ప్రారంభమైందని మారుతున్న పరిస్థితుల కనుగుణంగా కార్మికులకు భద్రత కల్పించేలా కార్మిక చట్టాలలో మార్పులు చేయాలని చాలా కాలంగా కేంద్ర కార్మిక సంఘాలు డిమాండ్ చేస్తున్నాయని దీనికి విరుద్ధంగా 29 కార్మిక చట్టాలను రద్దు చేసి వీటి స్థానంలో నాలుగు లేబర్ కోడ్ లను తీసుకొచ్చిందన్నారు. కొత్త చట్టాలలో ఎనిమిది గంటలకు మించి పని చేయించుకునే దానికి అనుమతి ఇచ్చే విధంగా ఎట్టి చాకిరి చేసే బానిసలుగా కార్మికులను తయారు చేయడమే ఈ కొత్త చట్టాల లక్ష్యమన్నారు. ఇవన్నీ కార్పొరేట్ సంస్థలకు పెద్దపెద్ద పారిశ్రామికవేత్తలకు అడ్డగోలు లాభాలు పెంచుకోవడానికి చట్టం చేయడమేనని అందుకే కేంద్ర కార్మిక సంఘాలు వివిధ జాతీయ ఫెడరేషన్లు రైతు సంఘాలు వ్యవసాయ కార్మిక సంఘాలు సంయుక్తంగా ఈ విధానాలను మార్చుకోవాలని ప్రభుత్వాన్ని హెచ్చరిస్తూ ఫిబ్రవరి 12న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెకు సిద్ధ అయ్యాయని ఇది కేవలం కార్మికులు ఉద్యోగులు రైతులకు మాత్రమే పరిమితం కాదు మొత్తం దేశ ప్రజల ప్రయోజనాల రక్షణ కోసం జరుగుతున్న సమ్మె అని ఈ సమ్మెలో జీడిమెట్ల పారిశ్రామిక ప్రాంతంలో ఉన్న కార్మికులు అధిక సంఖ్యలో సమ్మెలో పాల్గొని కొత్త చట్టాలను రద్దు చేసేదాకా పోరాడాలని అన్నారు ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు కే శీను నర్సింలు ఆంజనేయులు సురేష్ మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.



## ఘనంగా శివ స్వాముల ఇరుముడి మహోత్సవం

* కన్ సాన్ పల్లి నుండి శ్రీశైలం బయలుదేరి వెళ్లిన శివస్వాములు...
* పెద్ద ఎత్తున పాల్గొన్న భక్తులు

అందోలు, ప్రజాస్ఫూర్తి: అందోలు మండలం లోని కన్ సాన్ పల్లి గ్రామం లో శనివారం ఇరుముడి మహోత్సవ కార్యక్రమం ఘనంగా జరిగింది. గ్రామం లోని ఈశ్వరాలయంలో గురుస్వాములు శివస్వాములకు ఇరుముడులు కట్టారు. మాఘ మాసంలో మాలలు వేసుకొని సన్నిటి స్నానాలతో ఏకభుక్తం భుజిస్తూ నేలపై పండుకొని 41 రోజులు నిష్ఠతో శివ స్వాములు దీక్షలు చేపట్టారు. ఇరుముడులతో శివ స్వాములు శ్రీశైలం వెళుతున్న సందర్భంగా శివమాల ధరించిన శివ స్వాములు శివ సత్యం, శేఖర్, కృష్ణ మూర్తి, సాయికిరణ్ స్వాముల కుటుంబ సభ్యులు, బంధువులు గ్రామస్తులు పెద్ద ఎత్తున ఇరుముడుల కార్యక్రమంలో పాల్గొని శివ స్వాములను దర్శించుకొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. అనంతరం ఆలయం వద్ద ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమం లో పాల్గొన్నారు. కార్యక్రమంలో యూవజన కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ప్రవీణ్ ముదిరాజ్, మాజీ సర్పంచ్ వెంకటేశం, వార్డు మెంబర్లు తెనుగు మహిపాల్, వని మోహన్, వని రమాదేవి దుర్గేష్, బీజేపీ సీనియర్ నాయకులు కాల్వమీది రాములు, భజరంగ్ దళ్ నాయకులు దేవునూరి మాణిక్యం, దేవునూరి శ్రీశైలం, యువజన కాంగ్రెస్ నాయకులు బాల్ రాజ్, బుసనెల్లి ఆంజనేయులు, వని ప్రభు, మన్నె దస్తయ్య తో పాటు పలువురు పాల్గొన్నారు. శ్రీశైల భ్రమరాంబిక సమేత మల్లికార్జున స్వామి సన్నిధికి వెళ్లి ఇరుముడి అప్పచెప్పుటకు బయలుదేరుతున్నామని గ్రామ ప్రజలను అష్ట ఐశ్వర్యలతో ఆయురారోగ్యాలతో నిండు నూరేళ్లు జీవించాలని కోరుకుంటూ శ్రీశైలం బయలుదేరుతున్నట్టు శివస్వాములు తెలిపారు.

## నిరాశ్రయురాలికి ఆశ్రమం కల్పించిన పాపన్న గౌడ్

– అధికారుల అభినందనలు



కూకట్ పల్లి, ప్రజాస్ఫూర్తి : కూకట్ పల్లి పరిధిలోని దీన్ దయాల్ నగర్ బస్తీలో గత ఐదేళ్లుగా రోడ్లపైనే జీవనం గడుపుతున్న నిరాశ్రయురాలు రహీమాబీకి ఆశ్రయం కల్పించడంలో పాపన్న గౌడ్ కీలక పాత్ర పోషించారు. నిరాశ్రయుల పట్ల మానవత్వంతో స్పందిస్తూ సేవాభావాన్ని చాటిన ఆల్విన్ కాలనీ సర్కిల్ కమ్యూనిటీ ఆర్గనైజర్ పాపన్న గౌడ్‌ను అధికారులు , స్థానికులు అభినందించారు. బస్తీ వాసుల కథనం ప్రకారం, రహీమాబీ (వయస్సు సుమారు 55-60 సంవత్సరాలు) ఆరోగ్యం బాగున్న రోజుల్లో కాయకష్టం చేసుకుని అదే బస్తీలో అద్దె ఇంట్లో జీవనం సాగించేది. ఐదేళ్ల క్రితం ఆమె ఆరోగ్యం పూర్తిగా క్షీణించడంతో పని చేయలేని పరిస్థితి ఏర్పడింది. సరైన ఆదాయం లేకపోవడంతో అద్దె చెల్లించలేదన్న కారణంతో ఆమెను ఇంటి నుంచి బయటకు పంపించడంతో, దిక్కుతోచని స్థితిలో రోడ్లపైనే నివసించాల్సి వచ్చింది. వర్షం, ఎండను లెక్కచేయకుండా రోడ్లపైనే నిద్రిస్తూ, స్థానికులు పెట్టిన ఆహారంతో జీవనం సాగిస్తున్న రహీమాబీ పరిస్థితిని చూసి చలించిన బస్తీ వాసులు, “ఈమె పరిస్థితిని ఇక చూడలేకపోతున్నాం,ఏదైనా ఆశ్రమంలో చేర్చండి” అంటూ ఆల్విన్ కాలనీ సర్కిల్ కమ్యూనిటీ ఆర్గనైజర్ పాపన్న గౌడ్‌ను ఆశ్రయించారు.వెంటనే స్పందించిన పాపన్న గౌడ్, ఈ విషయాన్ని కూకట్పల్లిలోని అమర ఫౌండేషన్ నిర్వాహకుల దృష్టికి తీసుకువెళ్లి, సమన్వయం చేసి రహీమాబీని ఆశ్రమానికి తరలించే ఏర్పాట్లు చేశారు. శనివారం ఆమెను అమర ఫౌండేషన్ ఆశ్రమానికి తరలించి నివాసం, ఆహారం, సంరక్షణ కల్పించారు.ఇన్ని రోజులుగా రహీమాబీకి ఆహారం అందిస్తూ ఆదుకున్న స్థానిక మహిళలు, ఆమెను ఆశ్రమానికి తీసుకువెళ్తున్న సమయంలో కన్నీరు పెట్టుకోవడం అందరినీ కలచివేసింది. వారి మానవత్వం, పాపన్న గౌడ్ సేవాభావం కలిసి ఒక నిరాశ్రయురాలికి కొత్త జీవితం అందించిన ఉదాహరణగా ఈ ఘటన నిలిచింది.ఈ సందర్భంగా పలువురు అధికారులు మాట్లాడుతూ, “మానవసేవే మాధవసేవ. దేవుడు ఎక్కడో కాదు - ఆపదలో ఉన్న సాటి మనిషికి చేయూతనిచ్చే చేతుల్లోనే దేవుడు ఉంటాడు” అని పేర్కొన్నారు. సమాజంలో ప్రతి ఒక్కరూ ఇలాంటి సేవాభావాన్ని పెంపొందించుకోవాలని వారు పిలుపునిచ్చారు.

## నిర్ణీత ప్రమాణాలకు అనుగుణంగా పనులు పూర్తి చేయాలి

* షాపూర్ నగర్ డివిజన్ బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు పుప్పాల భాస్కర్



కుత్బుల్లాపూర్, ప్రజాస్ఫూర్తి : ఎటువంటి నాణ్యత లోపం లేకుండా, నిర్ణీత ప్రమాణాలకు అనుగుణంగా పనులు పూర్తి చేయాలని డివిజన్ బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు పుప్పాల భాస్కర్ అన్నారు. షాపూర్ నగర్ డివిజన్ పరిధిలోని సంజయ్ గాంధీ నగర్‌లో ఎంపీ లాడ్స్ నిధుల ద్వారా నూతనంగా నిర్మిస్తున్న కమ్యూనిటీ హాల్ పనులను స్థానిక డివిజన్ బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు పుప్పాల భాస్కర్, బస్తీ కమిటీ అధ్యక్షులు ఆర్టీసీ లక్ష్మీనారాయణ తో కలిసి పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ప్రజలకు దీర్ఘకాలంగా ఉపయోగపడే విధంగా నిర్మాణం జరగాలని, పారదర్శకత , నాణ్యతకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు అమర్, విష్ణు, నవీన్, స్థానిక నాయకులు ప్రసాద్ నాయుడు, రాజ్ కుమార్, రవికుమార్, డేవిడ్ తదితరులు పాల్గొన్నారు.

## అక్రమ స్పా–మసాజ్ కేంద్రాలపై పోలీసుల దాడులు

* వసంత నగర్‌లో ఎహెచ్టీయు , కేపీహెచ్బీ పోలీసుల తనిఖీలు

కూకట్ పల్లి, ప్రజాస్ఫూర్తి : నివాస ప్రాంతాల్లో నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న అక్రమ స్పా-మసాజ్ కేంద్రాలపై కేపీహెచ్బీ పోలీస్ అధికారులు కఠిన చర్యలు చేపట్టారు. వసంత నగర్ కాలనీ వాసులు శుక్రవారం సైబరాబాద్ పోలీస్ కమిషనర్, డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ (మహిళల భద్రతా విభాగం) కి ఫిర్యాదు చేయడంతో ఈ చర్యలు ప్రారంభమయ్యాయి. శనివారం యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ యూనిట్ కేపీహెచ్బీ పోలీసుల సంయుక్తంగా వసంత నగర్ ప్రాంతంలో విస్తృత తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా జయశ్రీ ఆయుర్వేదిక్ క్లినిక్ అండ్ స్పాపై దాడులు నిర్వహించి అక్కడ ఉన్న పలువురిని అదుపులోకి తీసుకున్నట్లు పోలీసు వర్గాలు వెల్లడించాయి.కేపీహెచ్బీ పోలీస్ స్టేషన్ పరిధిలో పలు స్పా-మసాజ్ కేంద్రాలపై ఆకస్మిక తనిఖీలు చేపట్టడంతో స్థానిక కాలనీవాసులు హర్షం వ్యక్తం చేశారు. అయితే అదే ప్రాంతంలో నిబంధనలకు విరుద్ధంగా కొనసాగుతున్నట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న అజయ్ శ్రీ ఆయుర్వేదిక్ క్లినిక్ అండ్ స్పా మసాజ్ కేంద్రం యజమానిపై కేసు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని కాలనీవాసులు డిమాండ్ చేస్తున్నారు.నివాస ప్రాంతాల్లో అక్రమంగా నడుస్తున్న స్పా-మసాజ్ కేంద్రాలు మహిళల భద్రతకు ముప్పుగా మారుతున్నాయని, ఇలాంటి కేంద్రాలను శాశ్వతంగా మూసివేయాలని స్థానికులు పోలీస్ అధికారులను కోరారు.

## అసంపూర్తిగా మిగిలిన పనులను త్వరలోనే పూర్తి చేస్తా

* కార్పొరేటర్ వెంకటేష్ గౌడ్



శేరిలింగంపల్లి, ప్రజాస్ఫూర్తి : కాలనీలో పెండింగ్లో ఉండి అసంపూర్తిగా మిగిలిన పనులను త్వరలోనే పూర్తి చేస్తామని అల్విన్ కాలనీ డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ అన్నారు. అల్విన్ కాలనీ డివిజన్ పరిధిలోని అల్విన్ కాలనీ ఫేస్ 2, చక్రదారి నగర్, కాకతీయ కాలనీ, వెంకటపాపయ్య నగర్, కేటీఆర్ కాలనీ, జయశంకర్ కాలనీ, పీజేఆర్ నగర్ ఫేస్ 1, పీజేఆర్ నగర్ ఫేస్ 2, వెల్ విషర్ కాలనీలలోని పెండింగ్ లో ఉన్న అభివృద్ధి పనుల పై డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ జి.హెచ్.ఎమ్.సి అధికారులు కాలనీ వాసులతో కలిసి పాదయాత్ర చేసి సమస్యలను పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ పాదయాత్ర చేస్తూ పర్యటించిన కాలనీలలో కొంతమేర డ్రైనేజీ , సీసీ రోడ్లకు సంబందించిన పెండింగ్ వర్క్స్ ఉన్నాయని, వాటిని శేరిలింగంపల్లి శాసనసభ్యులు పి.ఎ.సి చైర్మన్ అరేకపూడి గాంధీ దృష్టికి సంబంధిత అధికారుల దృష్టికి తీసుకువెళ్లి శాంక్షన్ చేయించి అతి త్వరలో నిర్మాణ పనులు మొదలుపెడతామని హామీ ఇచ్చారు. కాలనీలలో కొన్నిచోట్ల డామేజ్ అయిన మన్ హోల్ మూతలను వెంటనే మర్చి కొత్తవి అమర్చాలని సంబంధిత అధికారులకు తెలియచేసారు. కాలనీలలో స్ట్రీట్ లైట్స్, డ్రైనేజీ ఓవర్ ఫ్లో, పారిశుధ్యనికి సంబంధించి సమస్యలు ఉన్నాయని కాలనీ వాసులు కార్పొరేటర్ కి వివరించగా, కార్పొరేటర్ వెంటనే సంబంధిత అధికారులతో మాట్లాడి కాలనీ వాసులు తెలియచేసిన సమస్యలను వీలైనంత త్వరగా పరిష్కరించాలని ఆదేశించారు. డివిజన్ సమగ్ర అభివృద్దే ధ్యేయంగా ముందుకు వెళుతున్నాం అని, దశల వారిగా అభివృద్ధి పనులు చేపడుతామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో ఎస్.ఆర్.పి నాగేశ్వర నాయక్, వర్క్ ఇన్స్పెక్టర్ రవి కుమార్, యుబీడి నాగరాణి, ఎంటమాలజీ సూపర్వైజర్ డి.నరసింహులు, వాటర్ వర్క్స్ సూపర్వైజర్లు శ్రీనివాస్ , శివ, స్ట్రీట్ లైట్స్ సూపర్వైజర్ నరేష్, సిబ్బంది, నాయకులు, కార్యకర్తలు, మహిళలు, కాలనీ అసోసియేషన్ సభ్యులు, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

# కేసీఆర్‌ను కాపాడుతున్నారన్న రేవంత్ రెడ్డి... తీవ్రంగా స్పందించిన కిషన్ రెడ్డి

* ముఖ్యమంత్రికి చేతకాక తమపై నిందలు వేస్తున్నారని ఆగ్రహం
* కేసీఆర్‌పై చర్యలు తీసుకుంటామంటే ఎవరు అడ్డుకుంటారని ప్రశ్న
* మోదీని అడ్డుకోవడం కోసం సోనియా, కేసీఆర్ కుటుంబం కలిసిందన్న కిషన్ రెడ్డి

హైదరాబాద్ : మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, బీఆర్ఎస్ నాయకులు కేటీఆర్, హరీశ్ రావులను ఎప్పుడు అరెస్టు చేస్తారని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇటీవల ప్రశ్నించడం తెలిసిందే. వారిని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి కాపాడుతున్నారని ఆయన ఆరోపించారు. ఈ ఆరోపణలపై కిషన్ రెడ్డి స్పందించారు. ముఖ్యమంత్రికి చేతకాక వారిపై చర్యలు తీసుకోవడం లేదని విమర్శించారు. కానీ బాధ్యతారాహిత్యంతో తమపై విమర్శలు



చేస్తున్నారని మండిపడ్డారు. కేసీఆర్‌తో కలిసి ఉన్నామని చెప్పుకోవాలని వ్యాఖ్యానించారు. కిషన్ రెడ్డి వల్లనో, కేంద్ర ప్రభుత్వం వల్లనో చర్యలు తీసుకోవడం లేదని మాపై నిందలు వేయవద్దని అన్నారు. నాంపల్లిలోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ, కేసీఆర్‌పై చర్యలు తీసుకుంటానంటే రేవంత్ రెడ్డిని ఎవరు అడ్డుకున్నారో చెప్పాలని నిలదీశారు. రాష్ట్రంలో చర్యలు తీసుకోవాల్సింది ముఖ్యమంత్రి, ఇక్కడి ప్రభుత్వం కాదా అని ప్రశ్నించారు. తన పేరు లేదా కేంద్రం పేరు చెప్పి రేవంత్ రెడ్డి ఎక్కువ రోజులు తప్పించుకోలేరని అన్నారు. కేసీఆర్‌పై చర్యలు తీసుకోవాలని ఏ ఒక్కరోజైనా రాహుల్ గాంధీ రేవంత్ రెడ్డిని ప్రశ్నించారా అని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రధాని మోదీని అడ్డుకోవడం కోసం సోనియా గాంధీ కుటుంబం, కేసీఆర్ కుటుంబం ఒక్కటయ్యాయని ఆరోపించారు. మున్సిపల్ ఎన్నికల్లో బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలకు బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు.

## 60 సీట్లున్న బస్సులో 100 మంది ఎక్కితే గొడవలు కావా? : జగ్గారెడ్డి ఆసక్తికర వ్యాఖ్యలు

* మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించామన్న జగ్గారెడ్డి
* ఉచిత బస్సు పథకంపై ప్రతిపక్షాలు ఉద్దేశపూర్వకంగా విమర్శలు చేస్తున్నారని ఆగ్రహం
* ఆర్థిక పరిస్థితి బాగా లేకపోయినా ప్రభుత్వం హామీలను నెరవేరుస్తోందని వ్యాఖ్య



హైదరాబాద్ : తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించామని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి అన్నారు. అయితే ఉచిత బస్సు పథకంతో మహిళలు ఘర్షణలకు దిగుతున్నారంటూ ప్రతిపక్షాలు రాద్ధాంతం చేస్తున్నాయని మండిపడ్డారు. 60 సీట్లు ఉన్న బస్సులో 100 మంది ఎక్కితే గొడవలు కావా అని వ్యాఖ్యానించారు. ప్రతిపక్షాలు ఉద్దేశపూర్వకంగా విమర్శలు చేయడం సరికాదని అన్నారు. బియ్యం తక్కువ ఉన్నా తినేవాళ్లు ఎక్కువగా ఉన్న చందంగా ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం పరిస్థితి ఉందని వ్యాఖ్యానించారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగా లేకపోయినప్పటికీ తమ ప్రభుత్వం క్రమంగా అన్ని హామీలను నెరవేరుస్తోందని అన్నారు. సంగారెడ్డి మున్సిపాలిటీలో అన్ని వార్డుల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. కాంగ్రెస్ కౌన్సిలర్లను గెలిపిస్తే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో మాట్లాడి పనులు చేయిస్తానని హామీ ఇచ్చారు. ఒక్కో వార్డుకు రూ.8 కోట్లు మంజూరు చేయిస్తానని జగ్గారెడ్డి అన్నారు. సంగారెడ్డిలో అన్ని వార్డుల్లో కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపిస్తే రూ.300 కోట్లు తీసుకువస్తానని అన్నారు. 2013లో 5,500 మందికి ఇంటి స్థలాలు ఇచ్చానని గుర్తు చేశారు. గత పదేళ్లు బీఆర్ఎస్ అధికారంలో ఉందని, ఇప్పుడు మళ్లీ కాంగ్రెస్ అధికారంలో ఉన్నందున కొత్తగా దరఖాస్తు చేసుకున్న వారికి ఇంటి స్థలాలు ఇప్పిస్తానని స్పష్టం చేశారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో తన భార్య ఎమ్మెల్యేగా పోటీ చేస్తుందని ప్రకటించారు. తాను కాంగ్రెస్ పార్టీ కోసం తెలంగాణ మొత్తం తిరుగుతానని అన్నారు.

## ఫోరెన్సిక్ ల్యాబ్‌లో అగ్ని ప్రమాదం... ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ సంచలన వ్యాఖ్యలు


* ప్రపంచవ్యాప్తంగా కుదిపేస్తున్న ఎప్‌స్టీన్ కుంభకోణంతో పోల్చిన ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్
* ఫోరెన్సిక్ ల్యాబ్‌లో ప్రమాదం అనుమానాలకు తావిస్తోందన్న బీఆర్ఎస్ నేత
* ఆధారాల నిర్మూలనకు ప్రస్తుత పాలకులు ఎంతకైనా తెగిస్తారని ట్వీట్




హైదరాబాద్ : నాంపల్లిలోని ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబ్‌లో జరిగిన అగ్ని ప్రమాదంపై బీఆర్ఎస్ నాయకుడు ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ స్పందించారు. ఓటుకు నోటు ఆధారాలను ధ్వంసం చేయడానికేనా అంటూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ 'ఎక్స్' వేదికగా ట్వీట్ చేశారు. దీనిని రీట్వీట్ చేసిన ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ ఈ ప్రమాదంపై అనుమానాలు వ్యక్తం చేశారు. పోలీసు శాఖకు అత్యంత కీలకమైన, గట్టి భద్రత ఉన్న ఫోరెన్సిక్ ల్యాబ్‌లో అగ్ని ప్రమాదం జరగడం పలు అనుమానాలకు తావిస్తోందని, అనేక సున్నితమైన కేసులకు సంబంధించిన ఆధారాలు (2015 నాటి ఓటుకు నోటు కేసుతో సహా) ఇందులో భద్రపరచి ఉన్నాయని పేర్కొన్నారు. వాటి పరిస్థితి ఏమిటి? దీనిపై ఉన్నత స్థాయి విచారణ జరగాలని డిమాండ్ చేశారు. ఆధారాల నిర్మూలనకు ప్రస్తుత పాలకులు ఎంతకైనా తెగిస్తారని మండిపడ్డారు. అమెరికాలో ఎంతో మంది చిన్నారులను అపర కుబేరులకు అర్పించిన లైంగిక నేరస్తుడు ఎప్‌స్టీన్ జైలులో అనుమానాస్పదంగా చనిపోయాడని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు. కాగా, ఎప్‌స్టీన్ కుంభకోణం ప్రపంచవ్యాప్తంగా సంచలనం సృష్టిస్తున్న విషయం తెలిసిందే.

## పిల్లలతో కలిసి విజయారెడ్డి ఆత్మహత్య ఆ ఛానళ్లపై పరువు నష్టం దావా వేస్తానన్న సోదరుడు

* ఈ ఆత్మహత్య కేసులో తమకు ఇప్పటి వరకు అనుమానాలు లేవన్న సోదరుడు చిరంజీవి
* కొన్ని యూట్యూబ్ ఛానళ్లు అసత్య ప్రచారం చేస్తున్నాయని ఆగ్రహం
* హైకోర్టులో పరువు నష్టం దావా వేస్తామన్న సోదరుడు చిరంజీవి





హైదరాబాద్ : తన ఇద్దరు పిల్లలతో కలిసి గూడ్స్ రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్న సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ విజయారెడ్డి కేసులో తప్పుడు కథనాలు ప్రచారం చేస్తున్నారని ఆమె సోదరుడు చిరంజీవి ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఘటనకు సంబంధించి అసత్య ప్రచారం చేస్తున్న యూట్యూబ్ ఛానళ్లపై పరువు నష్టం దావా వేస్తామని అన్నారు. హైదరాబాద్‌లోని చర్లపల్లిలో గత వారం విజయారెడ్డి తన ఇద్దరు పిల్లలతో కలిసి ఆత్మహత్య చేసుకున్న విషయం తెలిసిందే. ఈ కేసు ఇంకా విచారణ దశలోనే ఉంది. ఆత్మహత్యకు గల కారణాలు ఏమిటనే విషయం వెల్లడి కాలేదు. అయితే ఈ ఘటనపై కొన్ని యూట్యూబ్ ఛానల్స్ తప్పుడు కథనాలు ప్రసారం చేస్తున్నాయని సోదరుడు చిరంజీవి అన్నారు. ఈ మేరకు ఆయా ఛానళ్లపై ఫిర్యాదు చేయడానికి మేడిపల్లి పోలీస్ స్టేషన్‌కు వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విజయారెడ్డి, పిల్లలు చేతనారెడ్డి, విశాల్ రెడ్డి మృతిపై తాము డిప్రెషన్‌లో ఉన్నామని ఆయన అన్నారు. తన చెల్లెలు ఆఫీసు వర్కుతో బిజీగా ఉండేదని, కంపెనీలో టీమ్ లీడర్ కాబట్టి 14 మందిని లీడ్ చేసేదని, దాంతో ఆమెపై డిప్రెషన్ ప్రభావం ఉండేదని అన్నారు. ముగ్గురి మరణంపై తమకు ఇప్పటి వరకు ఎలాంటి అనుమానాలు లేవని స్పష్టం చేశారు. మాపై అసత్య ప్రచారం చేస్తున్న యూట్యూబ్ ఛానళ్లపై ఫిర్యాదు చేయడానికి వస్తే కోర్టుకు వెళ్లమని పోలీసులు చెప్పారని, హైకోర్టులో పరువు నష్టం దావా వేస్తామని అన్నారు. విజయా రెడ్డి డిప్రెషన్ వల్లే ఆత్మహత్య చేసుకున్నారనే వార్తలను పోలీసులు ఖండించారు. ఈ ముగ్గురి ఆత్మహత్యకు గల కారణాలు ఇంకా తెలియలేదని, విచారణ జరుపుతున్నామని అన్నారు. కేసు దర్యాప్తు పూర్తయ్యాక వివరాలు వెల్లడిస్తామని పోలీసులు తెలిపారు.






## ఫోరెన్సిక్ ల్యాబ్ లో అగ్నిప్రమాదంపై కేటీఆర్ అనుమానాలు

* నాంపల్లిలోని ఫోరెన్సిక్ ల్యాబ్ లో అగ్నిప్రమాదం
* ఓటుకు నోటు కేసు వాయిస్ రికార్డింగులను నాశనం చేసే ప్రయత్నంగా కనిపిస్తోందన్న కేటీఆర్
* షార్ట్ సర్క్యూట్ కారణంగా ప్రమాదం జరిగిందని అంచనా వేస్తున్న అధికారులు

హైదరాబాద్ : హైదరాబాద్ నాంపల్లిలో ఉన్న ఫోరెన్సిక్ ల్యాబ్ లో అగ్నిప్రమాదం చోటుచేసుకున్న సంగతి తెలిసిందే. ఈ ప్రమాదంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అనుమానాలు వ్యక్తం చేశారు. ఎక్స్ వేదికగా ఆయన స్పందిస్తూ... ఓటుకు నోటు కేసుకు సంబంధించిన వాయిస్ రికార్డింగులను, ఫోన్ ట్యాపింగ్ కేసులో ఆధారాలు లేకపోవడాన్ని కప్పిపుచ్చేందుకు చేసిన ప్రయత్నంగా కనిపిస్తోందని పేర్కొన్నారు. ఇదే అంశంపై బీఆర్ఎస్ నేత మన్నె క్రిశాంక్ స్పందిస్తూ... ల్యాబ్ మొత్తం కాలిపోతోందని, ఏయే ఆధారాలు నాశనం చేశావు అంటూ రేవంత్ రెడ్డిని ఉద్దేశించి ప్రశ్నించారు. ప్రమాదం వివరాల్లోకి వెళితే... ల్యాబ్ లోని తొలి అంతస్తులో ఉన్న కంప్యూటర్ ల్యాబ్ లో తొలుత మంటలు చెలరేగాయి. నిమిషాల వ్యవధిలోనే భవనంలోని ఇతర ప్రాంతాలకు మంటలు వ్యాపించాయి. అగ్నిప్రమాదం కారణంగా ల్యాబ్ లోని కంప్యూటర్లు, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలు కాలిపోయాయి. కార్యాలయ సిబ్బంది ప్రాణభయంతో బయటకు పరుగులు తీశారు. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది ఐదు ఫైరింజన్లతో అక్కడకు చేరుకుని మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. షార్ట్ సర్క్యూట్ కారణంగానే ప్రమాదం చోటుచేసుకుందని అధికారులు ప్రాథమికంగా అంచనా వేస్తున్నారు. కీలకమైన కేసులు, ఫోరెన్సిక్ ఆధారాలకు సంబంధించిన డాక్యుమెంట్లు దెబ్బతిన్నాయా? అనే కోణంలో అధికారులు ఆరా తీస్తున్నారు.

## నన్ను బెదిరిస్తున్నారు.. నాకు ప్రాణహాని ఉంది బంజారాహిల్స్ పీఎస్ లో కేకే కుమారుడి ఫిర్యాదు


* కేకే కుమారుడు వెంకట్ కు బెదరింపులు
* బంజారాహిల్స్ లో 11 వందల గజాల స్థల వివాదం
* రూ. 3 కోట్లు ఇవ్వాలని బెదిరిస్తున్నారని వెంకట్ ఫిర్యాదు



హైదరాబాద్ : తెలంగాణ ప్రభుత్వ సలహాదారు కె.కేశవరావు కుమారుడు వెంకట్ కు బెదిరింపులు రావడం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశం అయింది. వివరాల్లోకి వెళితే, బంజారాహిల్స్ లోని 11 వందల గజాల స్థలానికి సంబంధించి ఇద్దరు వ్యక్తులు హైకోర్టులో పిల్ వేశారు. ఆ ఇద్దరు వ్యక్తులు తనను బెదిరిస్తున్నారని బంజారా హిల్స్ పీఎస్ లో వెంకట్ లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. ఈ వివాదాన్ని పరిష్కరించుకోవాలంటే తమకు రూ. 3 కోట్లు ఇవ్వాలని బెదిరించినట్టు వెంకట్ తన ఫిర్యాదులో పేర్కొన్నారు. డబ్బులు ఇవ్వకపోతే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి ఉంటుందని హెచ్చరించినట్టు ఆయన తెలిపారు. తనకు ప్రాణహాని ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. తనను తీవ్ర మానసిక ఆందోళనకు గురి చేస్తున్నారని పేర్కొన్నారు. ఈ క్రమంలో, ఆయన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

## జాతర ముగింపు.. టన్నుల కొద్దీ చెత్త, జంతు వ్యర్థాలతో... మురికికూపంలా మేడారం

ములుగు : ఆసియాలోనే అతిపెద్ద గిరిజన జాతర మేడారం సమ్మక్కసారలమ్మ మహాజాతర వైభవంగా ముగిసింది. అయితే, కోట్లాదిగా తరలివచ్చిన భక్తులు వెనుదిరిగిన అనంతరం మేడారం పరిసరాలు టన్నుల కొద్దీ చెత్తతో నిండిపోయాయి. ఈ వ్యర్థాలను తొలగించడం ఇప్పుడు అధికార యంత్రాంగానికి, పారిశుధ్య సిబ్బందికి పెను సవాల్‌గా మారింది. మేడారంతో పాటు కన్నెపల్లి, నార్లాపూర్,





కొంగల గట్టు వంటి ప్రాంతాల్లో దాదాపు 3 వేల టన్నుల చెత్త పేరుకుపోయినట్లు అధికారులు అంచనా వేస్తున్నారు. ముఖ్యంగా జంతు, కోళ్ల వ్యర్థాలు కుళ్లిపోవడంతో ఆ ప్రాంతమంతా తీవ్ర దుర్గంధం వెదజల్లుతోంది. ఈ నేపథ్యంలో సుమారు 6 వేల మంది పారిశుధ్య కార్మికులు యుద్ధప్రాతిపదికన శుభ్రతా కార్యక్రమాల్లో నిమగ్నమయ్యారు. అయితే, ఈ పనుల్లో పాల్గొంటున్న కార్మికులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. "రోడ్లు, ప్లాస్టిక్ క్లీనింగ్ అని చెప్పి ఇక్కడికి తీసుకొచ్చారు. కానీ ఇక్కడ జంతువుల తోళ్లు, తలకాయలు, కోళ్ల వ్యర్థాలు గుట్టలుగా పడి ఉన్నాయి. వాటిని చూస్తుంటేనే వాంతులు వస్తున్నాయి. ఇంత గలీజు పని మేమెప్పుడూ చేయలేదు" అని కొందరు కార్మికులు వాపోయారు. అమ్మవార్ల దయతోనే ఈ పని చేస్తున్నాం అని వారు కన్నీటిపర్యంతమయ్యారు. జాతరలో పోగైన వ్యర్థాల్లో దాదాపు 48 శాతం ప్లాస్టిక్, గాజు సీసాల వంటివి ఉండటం ఆందోళన కలిగిస్తోంది. సుమారు 100 టన్నుల ఖాళీ బాటిళ్లలో చాలా వరకు పగిలిపోయి ప్రమాదకరంగా మారాయి. మిగిలిన 52 శాతం బియ్యం, బెల్లం వంటివి భూమిలో కలిసిపోయేవిగా ఉన్నాయి. ప్రస్తుతం ఈ వ్యర్థాలను వేరు చేసి, మేడారం ప్రాంగణాన్ని శుభ్రపరిచే పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయి.

# రాహుల్ ఆరాటమంతా హెడ్‌లైన్స్ కోసమే: రిజిజు విమర్శలు

కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీపై కేంద్రమంత్రి కిరణ్ రిజిజు విమర్శలు చేశారు. హెడ్‌లైన్స్‌లో నిలిచేందుకు ఆయన ఆరాటపడుతున్నారని ఎద్దేవా చేశారు. ఈ మేరకు బిహార్ రాజధాని పట్నాలో శనివారం మీడియాతో మాట్లాడారు. ''ప్రధాని నరేంద్రమోదీ నాయకత్వంలో దేశం ఎంతో పురోగతి సాధించింది. తమ




60 ఏళ్ల పాలనలో దేశాన్ని బలహీనపరిచిన కాంగ్రెస్‌ను ప్రజలు ఇక విశ్వసించరు. వార్తల్లో నిలవాలన్న తాపత్రయంతోనే రాహుల్ గాంధీ అసంబద్ధ వాదనలు చేస్తున్నారు. అయితే ఇవన్నీ ఎలాంటి ఫలితాలను ఇవ్వవు'' అని రిజిజు విమర్శించారు.

*** 40-50 మంది విపక్ష ఎంపీలు దూసుకొచ్చారు: రిజిజు**

రాష్ట్రపతి ప్రసంగంపై ధన్యవాదాలు తెలిపే తీర్మానానికి ప్రధాని నరేంద్ర మోదీ ప్రసంగం లేకుండానే లోక్‌సభలో ఆమోదం తెలిపిన సంగతి తెలిసింది. ఆ పరిణామంపై రిజిజు మాట్లాడారు. ''ఆ రోజు 40-50 మంది విపక్ష ఎంపీలు స్పీకర్ చాంబర్‌లోకి దూసుకెళ్లారు. సరైన పద్ధతిలో మాట్లాడలేదు. అప్పుడు నేను కూడా చాంబర్‌లోనే ఉన్నాను. అప్పటికే లోక్‌సభలో ప్రధాని మాట్లాడేందుకు షెడ్యూల్ ఖరారైంది. వారి తీరు చూసిన తర్వాత ప్రధాని సభకు రాకపోవడమే మంచిదనే నిర్ణయం తీసుకున్నాం. మేం అధికారంలో ఉన్నాం. మేం మార్షల్స్‌ను ఉపయోగించొచ్చు. కానీ మేం అలా చేయాలనుకోలేదు. అందుకే ప్రధాని మాట్లాడకుండానే తీర్మానానికి ఆమోదం లభించింది'' అని మంత్రి మాట్లాడారు.

## అక్కాచెల్లెళ్ల ఆత్మహత్య కేసు..
# వెలుగులోకి కొత్త విషయాలు!

ఉత్తరప్రదేశ్‌లోని గాజియాబాద్‌లో ముగ్గురు అక్కాచెల్లెళ్లు ఆత్మహత్య చేసుకున్న కేసులో కొత్త విషయాలు బయటకు వస్తున్నాయి. బాధితుల తండ్రి చేతన్ కుమార్‌కు ముగ్గురు భార్యలు ఉన్నారని, వారందరూ ఒకే కుటుంబానికి చెందినవారేనని వెల్లడైంది. అంతేకాదు, పదేళ్ల క్రితం అతడితో సహజీవనం చేసిన మహిళ కూడా అనుమానాస్పద రీతిలో భవనం పైనుంచి పడి మరణించినట్లు తేలింది. గాజియాబాద్‌లోని భారత్ సిటీ సొసైటీలో ఇటీవల అపార్ట్‌మెంట్ 9వ ఫ్లోర్ నుంచి పడి ముగ్గురు అక్కాచెల్లెళ్లు బలవన్మరణానికి పాల్పడిన విషయం తెలిసిందే. కొరియన్ సంస్కృతికి అలవాటు పడిన వీరి నుంచి.. తండ్రి చేతన్ మొబైల్ ఫోన్లను లాగేసుకున్నాడు. దీంతో ఆన్‌లైన్ గేమ్స్ ఆడకుండా, స్నేహితులతో మాట్లాడకుండా అయ్యిందని, దాంతో తీవ్ర మనస్తాపానికి గురైనట్లు దర్యాప్తు అధికారులు పేర్కొన్నారు. ఆ తర్వాత తల్లి



ఫోన్ తీసుకొని కొరియన్ యాప్‌లు వినియోగించాలని వారు ప్రయత్నించినప్పటికీ కుదరలేదని గుర్తించామన్నారు.

**ముగ్గురు భార్యలు..**

అమ్మాయిల తండ్రి చేతన్‌కు ప్రస్తుతం ముగ్గురు భార్యలు ఉన్నట్లు దర్యాప్తులో తేలింది. ఆ ముగ్గురూ అక్కాచెల్లెళ్లు కావడం గమనార్హం. అంతేకాదు, 2015లో చేతన్ సహజీవన భాగస్వామి అనుమానాస్పద రీతిలో ఇంటిపైకప్పు నుంచి పడి మరణించినట్లు తేలింది. అయితే, దర్యాప్తు తర్వాత ఆత్మహత్యగా తేలడంతో ఆ కేసును కొట్టివేసినట్లు అధికారులు వెల్లడించారు. ఈ కేసులో అమ్మాయిలు వారి తల్లుల కంటే తండ్రిపైనే ఎక్కువ ఆప్యాయత చూపించేవారని.. అందుకే సూసైడ్ నోట్‌లోనూ ఆయన పేరునే ఎక్కువగా ప్రస్తావించినట్లు భావిస్తున్నామని పోలీసులు వెల్లడించారు. బాలికల గది నుంచి తొమ్మిది పేజీల పాకెట్ డైరీని స్వాధీనం చేసుకున్నామని, అందులో రాసి ఉన్న విషయాలపైనా దృష్టి సారించామన్నారు. ఇటీవల విక్రయించిన అమ్మాయిల ఫోన్‌లను ఐఎంఈఐ నంబర్ల సాయంతో రికవరీ చేసేందుకు ప్రయత్నిస్తున్నామని, తండ్రి చెబుతున్నట్లుగా వారి ఆన్‌లైన్ వ్యవహారశైలిని, కుటుంబ పరిస్థితులను పరీక్షిస్తున్నామని చెప్పారు.

# నడి సంద్రంలో చమురు స్మగ్లింగ్.. పట్టుకున్న కోస్ట్‌గార్డ్


నడిసముద్రంలో చమురు స్మగ్లింగ్ చేస్తున్న ఓ ముఠాను భారత కోస్ట్‌గార్డ్ సిబ్బంది సమర్థవంతంగా అడ్డుకున్నారు. ముంబయికి 100 నాటికల్ మైళ్ల దూరంలో నిర్వహించిన ఆపరేషన్‌లో మూడు నౌకలను అదుపులోకి తీసుకున్నారు. ఈ మేరకు అధికారులు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. భారత ఎక్స్‌క్లూజివ్ ఎకనామిక్ జోన్‌లో అనుమానస్పద కదలికలను కోస్ట్‌గార్డ్ అధికారులు గుర్తించారు. దీంతో సమీపంలోని ఓడల రాకపోకలపై నిఘా పెట్టారు. ఈ క్రమంలో మూడు నౌకలను అడ్డుకుని తనిఖీ నిర్వహించారు.



సిబ్బందిని విచారించారు. ఈ క్రమంలో చమురు స్మగ్లింగ్ బండారం బయటపడింది. ప్రస్తుతం ఘర్షణలు జరుగుతున్న వివిధ దేశాల నుంచి తక్కువ ధరకు చమురును సేకరించి పెద్దమొత్తంలో దానిని అక్రమంగా రవాణా చేసేందుకు ఈ ముఠా కొత్త విధానాన్ని రూపొందించిందని కోస్ట్‌గార్డ్ అధికారులు పేర్కొన్నారు. ఈ చమురును అంతర్జాతీయ జలాల్లో నుంచి మోటార్ ట్యాంకర్ల ద్వారా తరలిస్తున్నట్లు తెలిపారు. ఇలా చేస్తూ భారత్‌తో సహా తీర ప్రాంత రాష్ట్రాలకు చెల్లించాల్సిన కస్టమ్స్ సుంకాలను ఎగ్గొడుతున్నట్లు అధికారులు గుర్తించారు. వివిధ దేశాల్లో పనిచేసే హ్యాండ్లర్ల నెట్‌వర్క్ ద్వారా ఈ ముఠా నడుస్తుందని గుర్తించినట్లు తెలిపారు. ఎవరికీ పట్టుబడకుండా ఉండేందుకు తరచూ ఓడల గుర్తింపులను మారుస్తున్నట్లు ప్రాథమిక దర్యాప్తులో వెల్లడైందన్నారు. ఇక, నౌకలను అదుపులోకి తీసుకొని.. తదుపరి దర్యాప్తు కోసం ముంబయికి తీసుకెళ్లే అవకాశం ఉందని తెలిపారు. ముఠా సభ్యులను స్థానిక పోలీసులకు అప్పగించనున్నట్లు వెల్లడించారు. పట్టుబడిన నౌకల యజమానులు విదేశాల్లో ఉన్నట్లు పేర్కొన్నారు.

# 'నన్నే ప్రశ్నిస్తావా?' అంటూ టీచర్‌పై చేయి చేసుకున్న విద్యార్థి!


విద్యాబుద్ధులు నేర్పే ఉపాధ్యాయినిపై చేయి చేసుకున్నాడో విద్యార్థి. పరీక్షకు ఎందుకు ఆలస్యంగా వచ్చావని ప్రశ్నించినందుకు టీచర్‌పై దాడి చేశాడు. ''ఇంట్లోనే నన్నెవరూ ప్రశ్నించరు. అలాంటి నన్నే ప్రశ్నిస్తావా'' అంటూ చెంప దెబ్బ కొట్టాడు. గుజరాత్‌లో చోటుచేసున్న ఈ ఘటనకు సంబంధించిన వీడియో వైరల్‌గా మారడంతో పోలీసులు నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పంచమహల్ జిల్లాలోని ఓ ప్రైవేటు పాఠశాలలో జనవరి 24న 12వ తరగతి ప్రిలిమినరీ పరీక్షలు జరిగాయి. ఆ రోజు పరీక్షకు మహ్మద్ ఖాన్ అన్సారీ అనే విద్యార్థి ఆలస్యంగా వచ్చాడు. ఈ విషయంపై ఇన్విజిలేటర్ అతడిని ప్రశ్నించగా బాలుడు ఆగ్రహానికి గురయ్యాడు. ఉపాధ్యాయిని చెంపపై కొట్టి ఆమెను నెట్టేశాడు. ఇదంతా తరగతి గదిలో ఉన్న సీసీ కెమెరాలో రికార్డయింది. అదే రోజు పాఠశాల ఇన్‌ఛార్జి



విపుల్ పాఠక్‌ను, ఉపాధ్యాయినిని.. విద్యార్థి తరఫున అతడి తండ్రి క్షమాపణ కోరాడు. మూడు రోజుల తర్వాత (జనవరి 27న) అన్సారీ తండ్రితో పాటు, మరికొందరితో కలిసి పాఠశాలకు వెళ్లాడు. ఒంటరిగా నివాసం ఉంటున్న టీచర్‌ని కూడా బెదిరించాడు. ఈ ఘటనపై ఫిబ్రవరి 3న ఎఫ్ఐఆర్ నమోదైంది. టీచర్‌ను కొట్టిన దృశ్యాలు వైరల్‌గా మారడంతో నిందితుడిని రోడ్డుపై నడిపించుకుంటూ తీసుకెళ్లి అరెస్ట్ చేశారు.

## ఎంపీ తొలి ప్రసంగాన్ని
# అభినందిస్తూ.. మోదీ లేఖ

రాజ్యసభలో కేరళకు చెందిన భాజపా ఎంపీ సి. సదానందన్ మాస్టర్ తొలి ప్రసంగాన్ని ప్రధాని మోదీ ప్రశంసించారు. ఆయన మాటల్లో ప్రజాస్వామ్యం పట్ల నిబద్ధత కనిపిస్తోందని కొనియాడారు. ఈ మేరకు ఎంపీని అభినందిస్తూ మోదీ స్వయంగా లేఖ రాశారు. ''రాజ్యసభలో మొదటిసారి చేసిన మీ ప్రసంగాన్ని విన్నాను. మీరు లేవనెత్తిన అంశాలు బాగున్నాయి. ప్రజా సంక్షేమం, ప్రజాస్వామ్య విలువల పట్ల మీకు ఉన్న నిబద్ధత కనిపిస్తోంది. మీ మాటలు ఎంతో స్ఫూర్తినిచ్చాయి. దేశ సేవకు మీ కృషిని ఇలానే కొనసాగించాలి''అని మోదీ పేర్కొన్నారు. కాగా, ఇటీవల రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాద తీర్మానంపై సదానందన్ మాట్లాడుతూ.. ఏదైనా విషయంలో కేంద్రాన్ని గుడ్డిగా వ్యతిరేకించొద్దని ప్రతిపక్షాలకు విజ్ఞప్తి చేశారు. జాతీయ ప్రయోజనాల దృష్ట్యా కలిసి పనిచేయాలని



పిలుపునిచ్చారు. ఈ క్రమంలోనే 31 ఏళ్ల క్రితం.. ఓ రాజకీయ పార్టీకి చెందిన కార్యకర్తలు తనపై దాడి చేశారని, పథకం ప్రకారమే రెండు కాళ్లను నరికివేశారని గుర్తుచేశారు. తన రెండు కృత్రిమ కాళ్లను తీసి టేబుల్‌పై పెట్టి.. ఆయన విపక్షాలను నిలదీయడం చర్చనీయాంశమైన సంగతి తెలిసిందే.

# సీఎం ఎవరనేది కాలమే సమాధానం చెబుతుంది: డీకే

కర్ణాటకలో ముఖ్యమంత్రి మార్పు అంశం మరోసారి చర్చకు వచ్చింది. ఈ విషయంపై డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ కీలక వ్యాఖ్యలు చేశారు. సీఎం మార్పుపై కాంగ్రెస్ హైకమాండ్ తీసుకునే నిర్ణయానికి కట్టుబడి ఉంటానని, తాను సీఎం కావడంపై కాలమే సమాధానం చెబుతుందని తెలిపారు. ఈ మేరకు విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మార్చిలో ప్రవేశపెట్టబోయే రాష్ట్ర బడ్జెట్ తర్వాత సీఎం పదవి స్వీకరిస్తారా? అని డీకేను మీడియా ప్రశ్నించగా.. సీఎం మార్పుపై కాంగ్రెస్ అధిష్ఠానందే తుది నిర్ణయమని, తాను ఎప్పుడు సీఎం పదవి చేపట్టేదీ కాలమే నిర్ణయిస్తుందన్నారు. మరోవైపు, ఇటీవల తన తండ్రి ఐదేళ్ల పదవీ కాలాన్ని పూర్తి చేసుకుంటారని, దీనిపై కాంగ్రెస్ అధిష్ఠానం స్పష్టత ఇచ్చిందని ముఖ్యమంత్రి సిద్ధరామయ్య కుమారుడు యతీంద్ర సిద్ధరామయ్య చేసిన వ్యాఖ్యలపైనా డీకే స్పందించారు. ఎమ్మెల్సీ యతీంద్ర తమ హైకమాండ్ అని, ఆయన చెప్పిన విషయాన్ని గౌరవిస్తామంటూ వ్యంగ్యంగా బదులిచ్చారు.




# బిజినెస్ మ్యాన్ కిడ్నాప్ కేసు.. లేడీ డాన్ అరెస్ట్

ఒక వ్యాపారవేత్తను కిడ్నాప్ చేసిన కేసులో లేడీడాన్‌ను పోలీసులు అరెస్టు చేశారు. సెంట్రల్ క్రైమ్ బ్రాంచ్ కు చెందిన అధికారులు ఆమెను అదుపులోకి తీసుకున్నారు. పోలీసులు వెల్లడించిన వివరాల ప్రకారం.. గతేడాది ఆగస్టులో బెంగళూరు కు చెందిన రియల్ ఎస్టేట్ వ్యాపారిని కొందరు వ్యక్తులు కిడ్నాప్ చేశారు. ఈ ఘటనపై కేసు నమోదు కావడంతో.. సీసీబీ అధికారులు దర్యాప్తు చేపట్టారు. వ్యాపారి కిడ్నాప్ కేసులో నిందితుడిని అరెస్టు చేస్తుంటే, పోలీసులు విధులు నిర్వర్తించకుండా లేడీ డాన్ యశస్వినీ గౌడ అడ్డుకుంది. ఆ అభియోగాల కింద రెండు రోజుల క్రితం ఆమెను పోలీసులు



అరెస్టు చేశారు. 47 ఏళ్ల యశస్వినిపై నగరంలోని పలు పోలీసుస్టేషన్లలో ఏడుకు పైగా కేసులు ఉన్నాయని వెల్లడించారు. వ్యాపారి దగ్గరి నుంచి రాజేశ్ రూ.1.20 లక్షలు అప్పుగా తీసుకున్నాడు. కానీ వ్యాపారి ఎన్నిసార్లు అడిగినా ఆ మొత్తం తిరిగివ్వకపోగా.. అతని కిడ్నాప్‌నకు రాజేశ్ కుట్ర పన్నాడు. డబ్బులు తిరిగి ఇస్తానని మభ్యపెట్టి, కిడ్నాప్ చేశాడు. అంతేగాకుండా కారులో అటూఇటూ తిప్పుతూ మరికొంత మొత్తాన్ని కూడా బదిలీ చేయించుకొని.. వదిలేశాడు. దీనిపై ఆ వ్యాపారి కేసు పెట్టడంతో రాజేశ్‌ను అరెస్టు చేసే క్రమంలో గౌడ అడ్డుపడటంతో ఆమె అరెస్టయింది.

## ముంబయి మేయర్ ఎన్నిక..
# భాజపా అభ్యర్థిగా రితూ తావ్డే



ముంబయి మేయర్ పదవికి సంబంధించి అధికార మహాయుతి కూటమి అభ్యర్థిని ఖరారు చేసింది. భాజపా కార్పొరేటర్ రితూ తావ్డే ఈ బరిలోకి దిగనున్నట్లు ఆ పార్టీ నేత అమిత్ సతమ్ ప్రకటించారు. పార్టీ అగ్ర నాయకత్వంతో సంప్రదింపులు జరిపిన తర్వాత ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. స్థానికంగా భాజపా సీనియర్ నేత అయిన రితూ.. మూడుసార్లు కార్పొరేటర్‌గా ఎన్నికయ్యారు. ముంబయి మున్సిపల్ కార్పొరేషన్ విద్యా కమిటీ అధ్యక్షురాలిగా పనిచేసిన అనుభవం కూడా ఆమెకు ఉంది. ఇక, డిప్యూటీ మేయర్ పదవికి కూటమి అభ్యర్థిగా శివసేన కార్పొరేటర్ సంజయ్ శంకర్ ఘాడిని ఎంపిక చేసినట్లు సతమ్ వెల్లడించారు. రితూ, సంజయ్‌లు శనివారం నామినేషన్లు దాఖలు చేశారు. ఫిబ్రవరి 11న మధ్యాహ్నం ఈ మేయర్ ఎన్నిక జరగనుంది. కాగా.. బృహన్ ముంబయి కార్పొరేషన్ (బీఎంసీ)లో 227 స్థానాలకు జరిగిన ఎన్నికల్లో అధికార మహాయుతి కూటమి ఘన విజయం సాధించింది. 118 చోట్ల (భాజపా 89, శివసేన 29) గెలుపును కైవసం చేసుకుంది. ఇక, శివసేన (యూబీటీ) 65, దాని మిత్రపక్షాలైన మహారాష్ట్ర నవనిర్మాణ సేన 6, నేషనలిస్టు కాంగ్రెస్ పార్టీ (శరద్‌పవార్) 1, కాంగ్రెస్ 24, ఏఐఎంఐఎం 8, ఎన్సీపీ (అజిత్ పవార్) 3, సమాజ్ వాద్ పార్టీ 2 స్థానాలను దక్కించుకున్నాయి.

## 'హౌడీ మోదీ' కంటే.. నమస్తే ట్రంప్‌దే పైచేయి: ట్రేడ్ డీల్‌పై కాంగ్రెస్ విమర్శలు

భారత్ అమెరికా మధ్య ఖరారైన మధ్యంతర వాణిజ్య ఒప్పందంపై కాంగ్రెస్ విమర్శలు గుప్పించింది. ట్రేడ్ డీల్‌లోని వివరాల ప్రస్తావన సరిగ్గా లేవని పేర్కొంది. ఈ సందర్భంగా ప్రధాని మోదీ, అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌లను ఉద్దేశిస్తూ వ్యంగ్యాస్త్రాలు విసిరింది. కాంగ్రెస్ (Congress) సీనియర్ నేత జైరాం రమేశ్ ఈమేరకు ఎక్స్‌లో పోస్టు పెట్టారు. 'ట్రేడ్ డీల్ గురించి భారత్ అమెరికా చేసిన సంయుక్త ప్రకటనలో వివరాలను సరిగ్గా ప్రస్తావించలేదు. కానీ, భారత్ ఇక రష్యా నుంచి చమురు దిగుమతి చేసుకోదని తెలుస్తుంది. ఒకవేళ ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా గాని ఆ దేశం నుంచి చమురు కొనుగోలు చేస్తే మన వస్తువులపై 25శాతం సుంకాలు తిరిగి విధించవచ్చని అగ్రరాజ్యం ప్రకటించింది. దేశంలోని రైతుల ప్రయోజనాలను దెబ్బతీసి మరీ.. అమెరికన్ రైతులకు సాయం చేకూరేలా భారత్ దిగుమతులపై సుంకాలు తగ్గించనుంది. యూఎస్ దిగుమతులు మూడు రెట్లు ఎక్కువవడంతో మన వాణిజ్య మిగులు తుడిచిపెట్టుకుపోతుంది. మనకు చెందిన ఐటీ, ఇతర సేవల ఎగుమతులపై ఇంకా అనిశ్చితి కొనసాగుతోంది. ఈ క్రమంలో మన ఎగుమతుల్లోని కొన్ని వస్తువులు గతంలోకన్నా ఎక్కువ సుంకాలు ఎదుర్కోవాల్సి వస్తుంది' అని రాసుకొచ్చారు. ఈ సందర్భంగా 'హౌడీ మోదీ' కంటే.. 'నమస్తే ట్రంప్' పైచేయి సాధించారంటూ జైరాం రమేశ్ ఎద్దేవా చేశారు.

## ఎలాన్ మస్క్ స్పేస్ఎక్స్‌లో చైనా పెట్టుబడులు..

**అమెరికా భద్రతకు ముప్పంటూ సెనేటర్ల ఆందోళన**

**స్పేస్ఎక్స్‌పై సమీక్ష జరపాలని అమెరికా సెనేటర్ల డిమాండ్**

**కంపెనీలో చైనా రహస్యంగా పెట్టుబడులు పెట్టిందని ఆరోపణ**

**ఇది అమెరికా జాతీయ భద్రతకు ముప్పు అని తీవ్ర ఆందోళన**

**విషయంపై రక్షణ శాఖకు లేఖ రాసిన ఇద్దరు డెమొక్రటిక్ సెనేటర్లు**




**న్యూఢిల్లీ:** బిలియనీర్ ఎలాన్ మస్క్ నేతృత్వంలోని ఏరోస్పేస్ సంస్థ 'స్పేస్ఎక్స్' వ్యవహారంపై సమీక్ష జరపాలని ఇద్దరు అమెరికన్ డెమొక్రటిక్ సెనేటర్లు డిమాండ్ చేశారు. ఈ సంస్థలో చైనాకు చెందిన పెట్టుబడిదారులు రహస్యంగా వాటాలు కొనుగోలు చేశారని, ఇది అమెరికా జాతీయ భద్రతకు పెను ముప్పుగా పరిణమించే అవకాశం ఉందని వారు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ మేరకు రక్షణ శాఖ కార్యదర్శి పీట్ హెగ్సెత్‌కు వారు లేఖ రాశారు.

మసాచుసెట్స్ సెనేటర్ ఎలిజబెత్ వారెన్, న్యూజెర్సీ సెనేటర్ ఆండీ కిమ్.. రక్షణ శాఖకు రాసిన లేఖలో ఈ ఆందోళనలను ప్రస్తావించారు. స్పేస్ఎక్స్ రక్షణ శాఖకు ఒక ప్రధాన కాంట్రాక్టర్‌గా ఉందని గుర్తుచేశారు. ఇటీవల బయటపడిన కోర్టు రికార్డులు, మార్చిలో వచ్చిన ఒక ప్రోపబ్లికా పరిశోధనాత్మక కథనాన్ని వారు తమ లేఖలో ఉటంకించారు. ఆఫ్‌షోర్ ఖాతాల ద్వారా స్పేస్ఎక్స్‌లో చైనా పెట్టుబడిదారులకు వాటాలు కొనుగోలు చేసేందుకు అవకాశం కల్పిస్తున్నారని ఈ నివేదికలు ఆరోపిస్తున్నాయి.

"వ్యూహాత్మక రంగాల్లో ప్రత్యర్థి దేశాల నుంచి వచ్చే విదేశీ పెట్టుబడుల విషయంలో ప్రభుత్వ విధానాలకు ఇది విరుద్ధం. కీలకమైన సైనిక, నిఘా, పౌర మౌలిక సదుపాయాలను ఇది ప్రమాదంలో పడేస్తుంది" అని సెనేటర్లు పేర్కొన్నారు. రక్షణ శాఖతో స్పేస్ఎక్స్‌కు 5.9 బిలియన్ డాలర్ల లాంచ్ సర్వీస్ కాంట్రాక్టుతో సహా బిలియన్ల డాలర్ల విలువైన ఒప్పందాలున్నాయి. "మన జాతీయ భద్రతా వ్యవస్థకు మూలస్తంభంగా ఉన్న స్పేస్ఎక్స్ లాంటి సంస్థపై చైనా వంటి ప్రత్యర్థి దేశం పెత్తనం చెలాయించగలిగే అవకాశం ఉండడం ప్రమాదకరం" అని వారు స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలో కంపెనీకి సంబంధించిన రహస్య సమాచారాన్ని చైనా పెట్టుబడిదారులు తెలుసుకుని, అమెరికా జాతీయ భద్రతను దెబ్బతీసే ప్రమాదం ఉందని సెనేటర్లు హెచ్చరించారు.

స్పేస్ఎక్స్‌లో చైనా ప్రభావంపై తాము లేవనెత్తిన ప్రశ్నలకు, ఈ భద్రతాపరమైన ఆందోళనలను పరిష్కరించడానికి డీఓడీ ఎలాంటి చర్యలు తీసుకోబోతోందో ఫిబ్రవరి 18లోగా తెలియజేయాలని వారు తమ లేఖలో కోరారు.

## బడ్జెట్ భయాలను మరిపించిన అమెరికా డీల్..

**వారాంతంలో పరుగులు పెట్టిన మార్కెట్లు**

**బడ్జెట్ ప్రభావంతో మొదలైన ఒడిదొడుకులు**

**అమెరికా-భారత్ వాణిజ్య ఒప్పందంతో బలపడిన సెంటిమెంట్**

**ఆర్బీఐ వడ్డీ రేట్లను యథాతథంగా ఉంచడంతో పెరిగిన కొనుగోళ్లు**

**రియల్టీ, ఆటో రంగాలు లాభపడగా.. నష్టపోయిన ఐటీ రంగం**




**ముంబై:** ఈ వారం భారత స్టాక్ మార్కెట్లు తీవ్ర ఒడిదొడుకులకు లోనైనప్పటికీ, చివరికి మంచి లాభాలతో ముగిశాయి. 2026-27 బడ్జెట్‌లో డెరివేటివ్‌లపై సెక్యూరిటీస్ ట్రాన్సాక్షన్ ట్యాక్స్ పెంపుతో ఆరంభంలో బలహీనపడిన సూచీలు, అమెరికా-భారత్ మధ్య వాణిజ్య ఒప్పందం ప్రకటనతో అనూహ్యంగా పుంజుకున్నాయి. దేశీయ, అంతర్జాతీయ సానుకూల సంకేతాలు బడ్జెట్ భయాలను అధిగమించడంతో మదుపర్లలో విశ్వాసం పెరిగింది. ఫలితంగా వారం ముగిసేసరికి సెన్సెక్స్ 83,580.40 వద్ద, నిఫ్టీ 25,693.70 వద్ద స్థిరపడ్డాయి.

అమెరికా-భారత్ మధ్య ఉన్నత స్థాయి చర్చల అనంతరం భారత వస్తువులపై సుంకాలను 18 శాతానికి తగ్గిస్తున్నట్లు అమెరికా ప్రకటించడంతో మార్కెట్లలో కొనుగోళ్ల ఉత్సాహం పెరిగింది. దీనికి తోడు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రెపో రేటును 5.25 శాతం వద్ద యథాతథంగా ఉంచుతూ, జీడీపీ వృద్ధి అంచనాలను పెంచడం సెంటిమెంట్‌ను మరింత బలపరిచిందని రెలిగేర్ బ్రోకింగ్ రీసెర్చ్ ఎస్వీపీ అజిత్ మిశ్రా తెలిపారు. 2026 ఆర్థిక సంవత్సరానికి ద్రవ్యోల్బణం 2.1 శాతంగా ఉంటుందని ఆర్బీఐ అంచనా వేయడం కూడా మార్కెట్లకు కలిసొచ్చింది.


## అమెరికాతో వాణిజ్య ఒప్పందం..

**భారత వస్తువులపై అదనపు సుంకం ఎత్తివేత**

**భారత వస్తువులపై 18 శాతానికి సుంకాలు తగ్గించిన యూఎస్**

**అమెరికా పారిశ్రామిక, వ్యవసాయ ఉత్పత్తులపై సుంకాల తగ్గింపునకు భారత్ అంగీకారం**

**రాబోయే 5 ఏళ్లలో 500 బిలియన్ డాలర్ల అమెరికా వస్తువుల కొనుగోలుకు భారత్ నిర్ణయం**



**న్యూఢిల్లీ:** భారత్, అమెరికా మధ్య వాణిజ్య సంబంధాలను మరింత బలోపేతం చేస్తూ ఇరు దేశాలు కీలకమైన మధ్యంతర వాణిజ్య ఒప్పందంపై సంతకాలు చేశాయి. ఈ ఒప్పందంలో భాగంగా భారత వస్తువులపై అమెరికా తన సుంకాలను 18 శాతానికి తగ్గించింది. గతంలో విధించిన అదనపు 25 శాతం సుంకాన్ని కూడా ఉపసంహరించుకోవడం గమనార్హం. ఈ ఒప్పందం ఇరు దేశాల మధ్య వాణిజ్యానికి కొత్త ఊతాన్ని ఇవ్వనుంది.

ఈ ఒప్పందం ప్రకారం అమెరికా నుంచి దిగుమతి అయ్యే పలు పారిశ్రామిక ఉత్పత్తులతో పాటు వ్యవసాయ, ఆహార వస్తువులపై భారత్ సుంకాలను తగ్గించడం లేదా పూర్తిగా తొలగించనుంది. ఇందులో డ్రైడ్ డిస్టిలర్స్ గ్రెయిన్స్, పశువుల దాణా కోసం ఉపయోగించే ఎర్ర జొన్నలు, నట్స్, పండ్లు, సోయాబీన్ నూనె, వైన్, స్పిరిట్స్ వంటివి ఉన్నాయి. అదే సమయంలో భారత్ నుంచి ఎగుమతి అయ్యే టెక్స్‌టైల్స్, దుస్తులు, లెదర్, పాదరక్షలు, ప్లాస్టిక్, రబ్బరు, ఆర్గానిక్ కెమికల్స్, గృహాలంకరణ వస్తువులు, చేతివృత్తి ఉత్పత్తులపై అమెరికా 18 శాతం సుంకాన్ని వర్తింపజేస్తుంది.

# వాంఖడేలో సూర్య
# వన్ మ్యాన్ షో..

**యూఎస్ఏను చిత్తు చేసిన టీమిండియా..!**




**వాంఖడే:** డిఫెండింగ్ ఛాంపియన్ భారత జట్టు పొట్టి ప్రపంచకప్‌లో బోణీ కొట్టింది. వాంఖడేలో యూఎస్ఏ బౌలర్ల విజృంభణతో టాపార్డర్, మిడిలార్డర్ కుప్పకూలినా.. కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్(84 నాటౌట్) ఒంటరి సైనికుడిలా పోరాడి భారీ స్కోర్ అందించాడు. తనమార్క్ విధ్వంసంతో మెరుపు అర్ధ శతకం బాదిన అతడి శ్రమను బౌలర్లు సిరాజ్(3-29), అర్ష్‌దీపన్ సింగ్(2-18), అక్షర్ పటేల్ (2-24) వృథా చేయలేదు. 13 పరుగులకే 3 వికెట్లు కోల్పోయిన అమెరికా.. ఏ దశలోనూ ప్రత్యర్థి లక్ష్యం దిశగా సాగలేదు. 29 పరుగుల తేడాతో గెలుపొందిన భారత్ పాయింట్ల ఖాతా తెరిచింది.

స్వదేశంలో జరుగుతున్న పొట్టి ప్రపంచకప్‌లో అమెరికా ముప్పును గొప్పగా అధిగమించింది టీమిండియా. ప్రధాన ఆటగాళ్లంతా చేతులెత్తేసిన వేళ.. నేనున్నానంటూ సూర్యకుమార్ యాదవ్(84 నాటౌట్) కెప్టెన్ ఇన్నింగ్స్ ఆడాడు. ఒకేఒక్కడి పోరాటంతో గౌరవప్రదమైన స్కోర్ చేసిన భారత్.. అనంతరం బౌలర్ల జోరుతో యూఎస్ఏను 132కే కట్టడి చేసి విజయఢంకా మోగించింది.

### 13 పరుగులకే 3 వికెట్లు

టీ20 ప్రపంచకప్ తొలి పోరులో భారత బౌలర్లు రెచ్చిపోయారు. వాంఖడేలో సిరాజ్(3-29), అర్ష్‌దీప్



సింగ్(2-18)లు వికెట్ల వేటతో యూఎస్ఏ బ్యాటర్లను హడలెత్తించారు. పవర్ ప్లేలోనే వీరిద్దరి పేస్ పంజాకు ప్రత్యర్థి కీలక వికెట్లు కోల్పోయింది. తన రెండో ఓవర్లోనే సిరాజ్ ఓపెనర్ అండ్రీస్ గౌస్(6)ను ఔట్ చేసి బ్రేకివ్వగా.. అర్ష్‌దీప్ ఓవర్లో మొనాంక్ పటేల్(0) శివం దూబే చేతికి చిక్కాడు. కాసేపటికే సాయితేజ ముక్కనపల్లి(2)ని సిరాజ్ ఔట్ చేసి మూడో వికెట్ అందించాడు. అంతే.. 13 పరుగులకే మూడు వికెట్లు కోల్పోయింది అమెరికా.

ఆ తర్వాత మిలింద్ కుమార్(34), సంజయ్ కృష్ణమూర్తి(37)లు క్రీజునంటుకుపోయారు. భారత బౌలర్లను సమర్థంగా ఎదుర్కొంటూ నాలుగో వికెట్‌కు 58 రన్స్ జోడించిన మిలింద్‌ను వరణ్ ఓవర్లో ఇషాన్ స్టంపౌట్ చేశాడు. అక్షర్ పటేల్ రెండు వికెట్లు తీయడంతో.. ప్రత్యర్థి ఓటమి ఖాయమైంది. ఆఖర్లో శుభం రంజనే (37) మెరుపులు మెరిపించినా సరిపోలేదు. ఆరంభంలో తడబడినా.. సూర్య కుమార్ అర్ధ శతకంతో పుంజుకున్న భారత్.. బౌలర్ల కృషితో 29 పరుగుల తేడాతో గెలుపొందింది.

### ప్రచండ సూర్యుడిలా

తొలి పోరులో సూర్యకుమార్ యాదవ్(84 నాటౌట్) ప్రచండ సూర్యుడిలా ప్రతాపం చూపించాడు. వాంఖడేలో యూఎస్ఏ బౌలర్ల జోరుతో సహచరులు ఆడలేక ఔటైన చోట తానొక్కడే నిలబడి జట్టుకు ఊహించనంత స్కోర్ అందించాడు. వాన్ స్కాల్క్‌విక్(4-25) ఊహించని దెబ్బకొట్టగా 72కే సగం వికెట్లు పడినా.. పవర్ హిట్టర్ల నుంచి సహకారం అందకున్నా ఒంటరి సైనికుడులా చెలరేగాడు సూర్య. ఆఖరి ఓవర్లో.. 4, 6, 6, 4తో జట్టు స్కోర్‌కు 160 దాటించాడు సూర్య.

### సూర్యకుమార్ యాదవ్(84 నాటౌట్)

పవర్ ప్లే చివరి ఓవర్ రెండో బంతికే ఇషాన్‌ను బోల్తా కొట్టించిన స్కాల్క్‌విక్.. ఆ తర్వాత తిలక్ వర్మను ఊరించే బంతితో పెవిలియన్ చేర్చాడు. సిక్సర్ల శివం దూబే (0) సైతం బంతిని ఆడాలా? వద్దా అనుకుంటూ ఆడి నేత్రవల్కర్ చేతికి చిక్కాడు. చూస్తుండగానే నాలుగు వికెట్లు పడడంతో స్టేడియమంతా నిశబ్దంగా మారింది. రింకూ సింగ్(6), హార్దిక్ పాండ్యా(5)లు సైతం తేలిపోగా.. అక్షర్ పటేల్(14) అండతో సూర్య సమయోచిత ఇన్నింగ్స్ ఆడాడు. 15వ ఓవర్ తర్వాత రెచ్చిపోయిన కెప్టెన్ తనమార్క్ షాట్లతో అలరించాడు. 16వ ఓవర్లో మూడు ఫోర్లు, సిక్సర్‌తో 21 రన్స్ పిండుకున్న మిస్టర్ 360 .. ఆఫ్‌సైడ్ సంధించిన బంతులను లెగ్‌సైడ్ బౌండరీ తరలించి యూఎస్ఏ బౌలర్లను ఆశ్చర్యపరిచాడు. ఇన్నింగ్స్ ఆఖరి ఓవర్లో వరుసగా 4, 6, 6, 4 బాది ప్రత్యర్థికి 162 పరుగుల లక్ష్యాన్ని నిర్దేశించడంలో కీలకమయ్యాడు టీమిండియా సారథి.

## ఆతిథ్య జట్లను వేధిస్తున్న గాయాలు..

**వరల్డ్‌కప్ నుంచి వైదొలిగిన పేస్ అస్త్రాలు..!**



**న్యూఢిల్లీ:** పొట్టి ప్రపంచకప్ పోటీలకు ఆతిథ్యమిస్తున్న భారత్, శ్రీలంకను గాయాలు వెంటాడుతున్నాడు. పదో సీజన్‌లో ట్రోఫీపై కన్నేసిన ఇరుజట్లు అనూహ్యంగా కీలక పేసర్లను కోల్పో యాయి. లీగ్ దశలో తొలి మ్యాచ్‌కు ముందే పేస్ సంచలనాలు టోర్నీ నుంచి నిష్క్రమించారు. టీమిండియా ఆల్‌రౌండర్ హర్షిత్ రానా మోకాలి గాయంతో వైదొలగగా.. కో-హోస్ట్ లంకకు ఇషాన్ మలింగ దూరమయ్యాడు. దాంతో, హర్షిత్‌పై భారీ అంచనాలు పెట్టుకున్న భారత్. మలింగను ఆయుధంగా ప్రయోగించాలనుకున్న లంకకు పెద్ద షాక్ తగిలింది.

స్వదేశం పొట్టి వరల్డ్‌కప్ ట్రోఫీని ముద్దాడాలనే లక్ష్యంతో పటిష్టమైన స్క్వాడ్‌తో బరిలోకి దిగిన భారత్, శ్రీలంకకు తొలి మ్యాచ్‌కు ముందే బిగ్ షాక్. సూపర్ ఫామ్‌లో ఉన్న భారత పేస్ సంచలనం హర్షిత్ రానా మెగా టోర్నీకి దూరమయ్యాడు. దక్షిణాఫ్రికాతో వామప్ మ్యాచ్ అనంతరం గాయపడిన రానా.. కోలుకోకపోవడంతో మహమ్మద్ సిరాజ్‌ను ఎంపిక చేశారు సెలెక్టర్లు. తాజాగా శ్రీలంక సైతం యార్కర్ స్పెషలిస్ట్ ఇషాన్ మలింగ సేవల్ని కోల్పోయింది. వరల్డ్‌కప్ సన్నాహకాల్లో భాగంగా ఇంగ్లండ్‌తో మ్యాచ్‌లో ఎడమ భుజం ఎముక స్థానభ్రంశం చెందడంతో మైదానం వీడిన ఇషాన్ కోలుకోలేదు. దాంతో.. అతడి స్థానంలో ప్రమోద్ మధుషాన్ స్క్వాడ్‌లోకి వచ్చాడు.

ఇంగ్లండ్ సిరీస్‌లో ఆడిన అతడిని వరల్డ్‌కప్‌కోసం తీసుకోలేదు. కానీ, అనూహ్యంగా ఇషాన్ మలింగ గాయపడడంతో మధుషాన్‌కు అవకాశం లభించింది. ఎనిమిది టీ20ల అనుభమే ఉన్న మధుషాన్ ..12 వికెట్లు పడగొట్టాడు. మెగా ఈవెంట్‌లో పథిరన, చమీరతో కలిసి అతడు పేస్ దళంలో కీలకం కానున్నాడు. తొలి మ్యాచ్‌లో లంక ఫిబ్రవరి 8న ఐర్లాండ్‌ను ఢీకొట్టనుంది.

శ్రీలంక టీ20 ప్రపంచకప్ స్క్వాడ్ : దసున్ శనక(కెప్టెన్), పథుమ్ నిశాంక, కమిల్ మిశార, కుశాల్ మెండిస్, కమిందు మెండిస్, కుశాల్ జనిత్ పెరీరా, చరిత అసలంక, జనిత్ లియానగే, పవన్ రత్ననాయకే, వనిందు హసరంగ, దునిత్ వెల్లలాగే, మహీశ్ థీక్షణ, దుశ్మంత చమీర, మథీశ పథిరన, ప్రమోద్ మధుషాన్.

భారత టీ20 ప్రపంచకప్ స్క్వాడ్ : అభిషేక్ శర్మ, సంజూ శాంసన్(వికెట్ కీపర్), ఇసాన్ కిషన్, తిలక్ వర్మ, సూర్యకుమార్ యాదవ్(కెప్టెన్), అక్షర్ పటేల్, హార్దిక్ పాండ్యా, రింకూ సింగ్, వాషింగ్టన్ సుందర్, శివం దూబే, కుల్దీప్ యాదవ్, బుమ్రా, అర్ష్‌దీప్ సింగ్. వరుణ్ చక్రవర్తి. సిరాజ్.

## అఫ్గనిస్థాన్ మహిళా క్రికెటర్లకు మద్దతిస్తున్నా..

**తుది నిర్ణయం ఐసీసీదే..!**



**న్యూఢిల్లీ:** పురుషుల టీ20 ప్రపంచకప్ లీగ్ మ్యాచ్‌కు ముందు అఫ్గనిస్థాన్ కెప్టెన్ రషీద్ ఖాన్ సంచలన వ్యాఖ్యలు చేశాడు. ప్రభుత్వ ఆంక్షలతో విదేశాల్లో తలదాచుకుంటున్న తమ దేశ మహిళా క్రికెటర్లకు అతడు మద్దతు తెలిపాడు. న్యూజిలాండ్‌తో మ్యాచ్ సన్నద్ధతపై మాట్లాడిన రషీద్‌ను మీరు అఫ్గనిస్థాన్ మహిళా క్రికెటర్లకు మద్దతిస్తారా?అని విలేకరులు ప్రశ్నించారు. అందుకు రషీద్ ఖాన్ కచ్చితంగా మద్దతిస్తాను అని బదులిచ్చాడు.

ఐదేళ్ల క్రితం అఫ్గనిస్థాన్‌లో తాలిబాన్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత మహిళల హక్కులు హరించిపోయాయి. విద్యావంతులు, మేధావులు, మహిళా క్రికెటర్లు విదేశాల్లో తలదాచుకుంటున్నారు. ప్రభుత్వం ఆంక్షల నేపథ్యంలో పలువురు అమ్మాయిలు, మహిళలు క్రికెట్ ఆశను చంపుకొని బతికేస్తున్నారు. తమ అభిరుచిని గౌరవించి.. ఆడేందుకు అనుమతివ్వాలని వారు కోరుతున్నారు. ఇటీవలే పురుష క్రికెటర్లు బహిరంగంగా మద్దతు తెలపాలని మహిళా ప్లేయర్ ఫిరూజా అమిరి అభ్యర్థించింది. దాంతో.. ప్రపంచకప్ వేదికను మించిన బిగ్ స్టేజ్ ఉంటుందా? అనుకున్నాడేమో నాకేం అభ్యంతరం లేదని రషీద్ ఖాన్ పేర్కొన్నాడు.

'అఫ్గనిస్థాన్ మహిళల జట్టు కచ్చితంగా ఆడాలి. ఐసీసీ పూర్తి సభ్యత్వం కలిగిన జట్టుగా గుర్తించాలి. ఈ విషయం ఐసీసీకి, అఫ్గన్ క్రికెట్ బోర్డుకు తెలుసు. ఏ వేదికపై అయినా.. ఎవరైనా అఫ్గనిస్థాన్‌కు ప్రాతినిధ్యం వహిస్తున్నారంటే చాలా సంతోషం. నిజంగా అది మాకు గర్వపడాల్సిన సందర్భం. అయితే ఈ అంశంపై అఫ్గనిస్థాన్ క్రికెట్ బోర్డు, ఐసీసీ నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుంది. ఆటగాళ్లుగా మేము ఇందులో ఏం చేయలేం. ప్రస్తుతమున్న పరిస్థితుల్లో మేము చేయగలిగేది చాలా తక్కువే. అధికారంలో ఉన్నవారు ఈ విషయాన్ని మందుకు తీసుకెళ్తారని ఆశిస్తున్నా' అని ప్రీ-మ్యాచ్ మీడియా సమావేశంలో కాబూలీ సారథి వెల్లడించాడు.

## శ్రీలంక ఈ-మెయిల్, ఐసీసీ ఆంక్షల భయం..

**భారత మ్యాచ్ బాయ్‌కాట్‌పై పునరాలోచనలో పాకిస్థాన్..!**




**న్యూఢిల్లీ:** టీ20 ప్రపంచకప్ సందడి మొదలైంది. లీగ్ మ్యాచ్‌లతో, ఆటగాళ్ల మెరుపులతో స్టేడియాలు దద్ధరిల్లిపోతున్నాయి. కానీ, అభిమానుల దృష్టి మాత్రం భారత్, పాకిస్థాన్ మ్యాచ్‌పైనే ఉంది. భారత జట్టుతో ఆడబోమని పాకిస్థాన్ క్రికెట్ బోర్డు తేల్చి చెప్పడంతో ఫిబ్రవరి 15న ఏం జరుగనుంది? అని అందరిలోనూ ఉత్కంఠ నెలకొంది. ఈ నేపథ్యంలో పాక్ బోర్డు పట్టు సడలించనుందని సమాచారం. ఐసీసీ ఆంక్షలతో కోట్లాది రూపాయలు కోల్పోవాల్సి వస్తుందనే భయానికి తోడు.. లాహోర్ దాడిని గుర్తు చేస్తూ శ్రీలంక క్రికెట్ రాసిన మెయిల్‌తో పీసీబీ పునరాలోచనలో పడినట్టుగా తెలుస్తోంది.

పొట్టి ప్రపంచకప్‌లో భారత్, పాకిస్థాన్ క్రికెట్ మ్యాచ్‌పై ఉత్కంఠ కొనసాగుతోంది. బంగ్లాదేశ్‌కు మద్దతుగా కొలంబోలో ఫిబ్రవరి 15న భారత జట్టుతో ఆడాల్సిన మ్యాచ్‌ను బాయ్‌కాట్ చేస్తామని పాకిస్థాన్ క్రికెట్ బోర్డు ప్రకటించడమే అందుకు కారణం. అయితే.. ఎంపిక పద్ధతిన వరల్డ్‌కప్‌లో ఆడాలనుకుంటున్న పాకిస్థాన్‌పై భారీ ఆంక్షలు తప్పవని ఐసీసీ స్పష్టం చేసింది. ఆతిథ్య శ్రీలంక బోర్డు సైతం ఇండియాతో ఆడాలని కోరింది. లేదంటే ఆర్థికంగా నష్టపోవడమే కాకుండా.. పరువూ పోతుందని పాక్ బోర్డును లంక క్రికెట్ హెచ్చరించింది. ఈ నేపథ్యంలో పునరాలోచనలో పడిన పీసీబీ చీఫ్ మొహ్సిన్ నఖ్వీ ప్రభుత్వంతో చర్చలు జరిపేందుకు సిద్ధమవుతున్నాడట.

'శ్రీలంక ప్రభుత్వంలోనే కాదు.. ఆ దేశం జట్టుతోనూ పాకిస్థాన్ సన్నిహిత సంబంధాలు కొనసాగిస్తోంది. లంక బోర్డు పంపిన ఈమెయిల్‌ను తేలికగా తీసుకోవడానికి లేదు. ఇప్పటికే శ్రీలంక బోర్డు అధ్యక్షుడు షమ్మీ సిల్వా పాక్ క్రికెట్ చీఫ్ మొహ్సిన్ నఖ్వీతో నేరుగా మాట్లాడాడు. ఈసాక్ పాక్ క్రికెట్ అవసరం తమకు ఏర్పడిందని, భారత్ ? పాకిస్థాన్ మ్యాచ్ జరుగకుంటే తాము భారీగా నష్టాలు చవిచూడాల్సి వస్తుందని ఆయన వాపోయాడు. దాంతో.. ఇండియా మ్యాచ్ బాయ్‌కాట్ విషయంపై పాక్ పునరాలోచనలో పడింది. ఈ విషయంపై ప్రభుత్వంతో మాట్లాడుతానని శ్రీలంక బోర్డు అధ్యక్షుడికి నఖ్వీ మాటిచ్చాడు. లంక ఈమెయిల్‌ను ప్రధాని దృష్టికి తీసుకెళ్లి.. సోమవారం లోపు ప్రకటన చేస్తామని ఆయన చెప్పాడు' అని పాక్ బోర్డు సన్నిహిత వర్గాలు తెలిపాయి.

నిరుడు నవంబర్‌లో పాకిస్థాన్ పర్యటనకు వెళ్లిన శ్రీలంక.. భద్రత విషయంలో రాజీ పడాల్సి వచ్చింది. స్టేడియానికి సమీపంలో బాంబు పేలుడతో భయాందోళనకు లోనైన లంక ఆటగాళ్లు సిరీస్ మధ్యలోనే స్వదేశం వచ్చేయాలనుకున్నారు. కానీ, పాక్ బోర్డు అభ్యర్థనతో తమ క్రికెటర్లను సిరీస్ ముగిశాకే రావాల్సిందిగా లంక బోర్డు ఆదేశించింది. సో.. ఇప్పుడు తమ దేశంలో నిర్వహిస్తున్న వరల్డ్‌కప్ మ్యాచ్‌ను పాక్ బాయ్‌కాట్ చేయడంపై లంక క్రికెట్ అభ్యంతరం వ్యక్తం చేసింది.

# అందాల శ్రద్ధాకు ఆఫర్లు కరువాయే..

Shraddha Das




టాకీస్: టాలీవుడ్ హాట్ బ్యూటీ శ్రద్ధాదాస్. ఈ అందాల భామ గురించి తెలుగు సినీప్రియులకు ప్రత్యేకంగా పరిచయం అక్కర్లేని పేరు. దాదాపు 20 ఏళ్లుగా సినీరంగంలో రాణిస్తున్న ఈ ముద్దుగుమ్మ.. ఇప్పటివరకు సరైన బ్రేక్ అందుకోలేదు. అప్పుడప్పుడు అవకాశాలు వస్తున్నప్పటికీ సరైన స్టార్ డమ్ కోసం ఇంకా ఎదురుచూస్తుంది ఈ బ్యూటీ. 40 ఏళ్లకు చేరువలో ఉన్న ఈ వయ్యారి.. చెక్కు చెదరని గ్లామర్ సొగసులతో కుర్రాళ్ల గుండెల్లో సెగలు రేపుతున్నారు. నెట్టింట ఈ అమ్మడు షేర్ చేసిన ఫోటోస్ తెగ వైరలవుతున్నాయి. ఓ వైపు చీరకట్టులో కట్టిపడేస్తూనే మరో వైపు మోడ్రన్ డ్రస్సుల్లో మతిపోగొడుతోంది. తెలుగు, తమిళం, కన్నడ, మలయాళం, హిందీ, బెంగాళీ భాషలలో పలు చిత్రాల్లో నటించి ప్రేక్షకులకు దగ్గరయ్యింది. ఇండస్ట్రీలోకి అడుగుపెట్టి 20 సంవత్సరాలు కావొస్తున్నా ఇప్పటివరకూ ఈ బ్యూటీకి సరైన బ్రేక్ రాలేదు. అల్లు అర్జున్, ప్రభాస్ లాంటి స్టార్ హీరోల సినిమాల్లో నటించిన అనుకున్నంతగా గుర్తింపు తెచ్చుకోలేకపోయింది శ్రద్ధాదాస్. ప్రస్తుతం ఈ బ్యూటీ అడపాదడపా సినిమాల్లో మెరుస్తుంది. కానీ సోషల్ మీడియాలో మాత్రం ఓ రేంజ్ లో అందాలతో ఆకట్టు కుంటుంది. తన గ్లామర్ తో దర్శకనిర్మాత దృష్టిని ఆకర్షిస్తుంది శ్రద్ధాదాస్. సోషల్ మీడియాలో ఈ బ్యూటీ ఫోటోలకు యమా డిమాండ్ ఉంటుంది. నెటిజన్స్ ఈ బ్యూటీ పిక్స్ కు తెగ లైకులు కామెంట్స్ చేస్తున్నారు.

MOVIE TIME

## జపాన్‌లో ప్రభాస్ హవా..

### ప్రముఖ మ్యాగజైన్ కవర్‌పై సోలోగా డార్లింగ్




టాకీస్: పాన్-ఇండియా స్టార్ ప్రభాస్ క్రేజ్ జపాన్‌లోనూ విస్తరిస్తోంది. తాజాగా ఆయన జపాన్‌కు చెందిన ప్రముఖ 'అనన్' మ్యాగజైన్ బ్యాక్ కవర్‌పై సోలోగా మెరిశారు. ఈ నెల 10న విడుదల కానున్న 2483వ సంచికపై ఆయన ఫొటోను ప్రచురించారు. ఈ ఫీచర్‌ను "రాయల్ ఆడియన్స్ గ్రావుర్" అంటూ అభివర్ణించిన మ్యాగజైన్, జపాన్ అభిమానులతో ప్రభాస్‌కు ఉన్న బలమైన అనుబంధాన్ని హైలైట్ చేసింది. 'బాహుబలి' సినిమాతో జపాన్‌లో ప్రభాస్‌కు అభిమానగణం ఏర్పడగా, 'సలార్' చిత్రంతో అది మరింత పెరిగింది. ఇక 'కల్కి 2898 ఏడీ' విడుదలతో ఆయన పాప్యులారిటీ శిఖరస్థాయికి చేరింది. ఈ నేపథ్యంలోనే 2025 డిసెంబర్‌లో ప్రభాస్ టోక్యోలో పర్యటించినప్పుడు ఈ ప్రత్యేక ఫోటోషూట్ నిర్వహించారు. భారతీయ నటుడు ఒకరు జపాన్ ప్రముఖ మ్యాగజైన్‌పై సోలోగా కనిపించడం అరుదైన గౌరవంగా భావిస్తున్నారు. ఈ పరిణామం విదేశాల్లో ప్రభాస్ క్రేజ్‌ను, ఆయనకున్న అంతర్జాతీయ ఇమేజ్‌ను మరోసారి స్పష్టం చేస్తోంది. అంతర్జాతీయంగా ప్రభాస్ ఇమేజ్‌కు ఇది నిదర్శనమని డార్లింగ్ ఫ్యాన్స్ ఫుల్ ఖుషీ అవుతున్నారు.

## పవన్ అభిమానులకు డబుల్ ధమాకా

### వచ్చేనెలలో ఉస్తాద్ విడుదలతో పాటు కొత్త మూవీకి రెడీ



టాకీస్: పవన్ కళ్యాణ్ అభిమానులకు వచ్చే నెల నిజంగానే డబుల్ ట్రీట్ కానుంది. ఒకవైపు ఆయన హీరోగా నటించిన 'ఉస్తాద్ భగత్ సింగ్' చిత్రం విడుదలకు సిద్ధమవుతుండగా, మరోవైపు కొత్త సినిమాకు కూడా శ్రీకారం చుట్టబోతున్నారు. ప్రస్తుతం పవన్ కళ్యాణ్ సరికొత్త స్టైలిష్ లుక్‌లో కనిపిస్తుండటం అభిమానుల్లో మరింత ఆసక్తి పెంచుతోంది. పవన్ కళ్యాణ్ నటించిన 'ఉస్తాద్ భగత్ సింగ్' సినిమా మార్చి 26న ప్రేక్షకుల ముందుకు రానుంది. అదే నెలలో ఆయన కొత్త ప్రాజెక్ట్ కూడా ప్రారంభం కానుంది. ఉగాది సందర్భంగా మార్చి 19న పవన్ కళ్యాణ్ -సురేందర్ రెడ్డి కాంబినేషన్‌లో తెరకెక్కనున్న చిత్రానికి పూజా కార్యక్రమాలు జరగనున్నట్లు సమాచారం. గ్యాంగ్‌స్టర్ బ్యాక్‌డ్రాప్‌లో రూపొందనున్న ఈ సినిమాకు రెగ్యులర్ షూటింగ్ ఏప్రిల్ తొలి వారం నుంచి ప్రారంభమయ్యే అవకాశం ఉందని సినీ వర్గాలు చెబుతున్నాయి. ఈ చిత్రాన్ని రామ్ తాళ్లూరి నిర్మించనున్నారని, పాన్ ఇండియా స్థాయిలో భారీ బ్జడెట్‌తో రూపొందించేందుకు మేకర్స్ ప్లాన్ చేస్తున్నారని టాక్. త్వరలోనే అధికారిక ప్రకటన వచ్చే అవకాశం ఉంది. ప్రస్తుతం పవన్ కళ్యాణ్ కనిపిస్తున్న స్టైలిష్ లుక్ కూడా ఈ సినిమాకోసమే రెడీ చేసినదేనని ప్రచారం జరుగుతోంది. ఇప్పటికే 'ఓజీ' చిత్రంలో ముంబై గ్యాంగ్‌స్టర్‌గా కనిపించి ప్రేక్షకులను ఆకట్టుకున్న పవన్ కళ్యాణ్‌ను అదే తరహా పాత్రల్లో చూడాలని నేటి తరం ప్రేక్షకులు కోరుకుంటున్నారు. ఆ అభిరుచిని దృష్టిలో పెట్టుకుని మరోసారి గ్యాంగ్‌స్టర్ బ్యాక్‌డ్రాప్ కథనే ఎంచుకున్నారని ఫ్యాన్స్ భావిస్తున్నారు. రాబోయే ఈ సినిమా 'ఓజీ' కంటే కూడా ఎక్కువ క్రేజ్ తెచ్చుకుంటుందని అభిమానులు నమ్మకం వ్యక్తం చేస్తున్నారు.

## 'సాంప్రదాయిని సుప్పిని సుద్దపూసని'

### ట్రైలర్ లాంచ్‌లో పాల్గొన్న అనిల్ రావిపూడి




**టాకీస్:** శివాజీ - లయ ప్రధానపాత్రలో నటించిన చిత్రం 'సాంప్రదాయిని సుప్పిని సుద్దపూసని' సుధీర్ శ్రీరామ్ దర్శకత్వం వహించిన ఈ సినిమా ఫిబ్రవరి 12 నుంచి ఈటీవీ విన్ వేదికగా ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ నేపథ్యంలో తాజాగా ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌ను నిర్వహించారు. అనిల్ రావిపూడి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. నా సినిమాలో హీరోలే నాకు దేవుళ్లు. వాళ్లను అలానే చూస్తాను. ఈ సినిమాలో లయ కొత్తగా కనిపించనున్నారు. శివాజీ సినిమాను ఎంత ప్రేమిస్తారో అందరికీ తెలిసిందే. 'సాంప్రదాయిని సుప్పిని సుద్దపూసని' అందరినీ నవ్విస్తుంది. ఈ ఈవెంట్‌కు పిలవడం కోసం శివాజీ ఫోన్ చేసినప్పుడు ఒక మాట చెప్పాడు. 'ఈసారి జాగ్రత్తగా మట్లాడతాను' అని చెప్పారు. కచ్చితంగా వస్తానన్నాను' అని అనిల్ రావిపూడి అన్నారు. ఈ సినిమా నవ్విస్తుందా.. భయపెడుతుందా? అనగా..నవ్విస్తూ.. భయపెడుతుంది. చివరి వరకూ ఉత్కంఠ ఉంటుందని శివాజీ అన్నాడు. 50ఏళ్ల పూర్తవుతున్న సందర్భంగా నిర్మాతగా మారే అవకాశాలు ఏమైనా ఉన్నాయా? అంటే.. అనిల్ రావిపూడి హీరోగా చేస్తే.. నేను నిర్మాతను అవుతా. ఎందుకంటే అనిల్ మల్టీటాలెంటెడ్ అని కితాబునిచ్చారు. నా కెరీర్ పూర్తయిందని అనుకున్నాను. ఆ సమయంలో ఓటీటీ వచ్చింది.

## సిద్ధూ జొన్నలగడ్డ కొత్త చిత్రం


### డైరెక్టర్ ఆర్ఎస్‌జేతో మూవీ

టాకీస్: టాలీవుడ్ స్టార్ బాయ్ సిద్ధు జొన్నలగడ్డ కొత్త సినిమాను ప్రారంభించాడు. శనివారం ఫిబ్రవరి7 ఆయన పుట్టినరోజు సందర్భంగా అభిమానులకు అదిరిపోయే అప్‌డేట్ అందింది. ప్రస్తుతం సరైన హిట్లు లేక సతమవుతున్న సిద్ధు తన తదుపరి చిత్రాన్ని దర్శకుడు స్వరూప్ ఆర్ఎస్‌జే (ఏజెంట్ సాయి శ్రీనివాస ఆత్రేయ ఫేమ్) తో చేయనున్నట్లు అధికారికంగా ప్రకటించారు. ఈ క్రేజీ కాంబినేషన్‌లో రాబోతున్న చిత్రాన్ని ప్రముఖ నిర్మాణ సంస్థలు సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ మరియు ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. ప్రస్తుతం 'ప్రొడక్షన్ నెం. 40'గా పిలుస్తున్న ఈ సినిమాకు సంబంధించి త్వరలోనే మరిన్ని వివరాలను చిత్రబృందం వెల్లడించనుంది. సిద్ధు తనదైన శైలిలో మరోసారి వెండితెరపై మ్యాజిక్ చేయడానికి సిద్ధమవుతున్నారని ఈసారి బాక్సాఫీస్ వద్ద బ్లాస్ట్ ఖాయమని చిత్ర యూనిట్ ధీమా వ్యక్తం చేస్తూ సిద్ధుకు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపింది. సితార బ్యానర్‌లో సిద్ధుకి ఇది హ్యాట్రిక్ సినిమా కావడం విశేషం.




## హైదరాబాద్‌లో దోమల బాధ సెటైరికల్‌గా కార్తికేయ వీడియో విడుదల

హైదరాబాద్ నగరంలో దోమల ఉధృతి ఏ స్థాయిలో ఉందో ప్రత్యేకంగా చెప్పక్కర్లేదు. సామాన్యుల నుంచి సెలబ్రిటీల వరకు అందరూ ఈ సమస్యతో ఇబ్బంది పడుతున్నారు. అయితే ఈ విషయంపై ప్రభుత్వం ఎటువంటి చర్యలు తీసుకపోవడంతో ఇదే విషయాన్ని సెటైరికల్‌గా తెలియజేశాడు రాజమౌళి తనయుడు ఎస్ఎస్ కార్తీకేయ. ప్రస్తుతం కార్తీకేయ ఒక సినిమా షూటింగ్ పనుల్లో బిజీగా ఉన్నారు. అర్ధరాత్రి జరుగుతున్న ఈ షూటింగ్‌లో దోమలు విపరీతంగా ఉండటంతో



యూనిట్ సభ్యులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఈ సమస్యను వ్యంగ్యంగా చూపిస్తూ కార్తీకేయ ఒక వీడియోను చిత్రీకరించారు. షూటింగ్ లైట్ల వెలుతురులో దోమలు గుంపులు గుంపులుగా తిరుగుతున్న దృశ్యాలను ఆయన కెమెరాలో బంధించారు. 'హైదరాబాద్ దోమలు మామూలుగా లేవు.. షూటింగ్ చేయడం కూడా కష్టమైపోతోంది' అనే అర్థం వచ్చేలా ఆయన చేసిన ఈ వీడియో చూసి నెటిజన్లు రకరకాలుగా స్పందిస్తున్నారు.

## జీ5 వేదికగా ఓటీటీలోకి మన శంకరవరప్రసాద్ గారు




**టాకీస్:** మెగాస్టార్ చిరంజీవి అభిమానులు ఎంతగానో ఎదురుచూస్తున్న ఆ క్షణం రానే వచ్చేసింది. ఈ ఏడాది సంక్రాంతి కానుకగా విడుదలై బాక్సాఫీస్ వద్ద కలెక్షన్ల సునామీ సృష్టించిన 'మన శంకర వరప్రసాద్ గారు' చిత్రం ఇప్పుడు డిజిటల్ తెరపై సందడి చేసేందుకు సిద్ధమైంది. ప్రముఖ ఓటీటీ సంస్థ జీ5 ఈ చిత్ర డిజిటల్ హక్కులను సొంతం చేసుకోగా.. ఈ సినిమాను ఫిబ్రవరి 11నుంచి తెలుగుతో పాటు తమిళం, మలయాళం, హిందీ, కన్నడ భాషల్లో స్ట్రీమింగ్ కాబోతున్నట్లు చిత్రబృందం ప్రకటించింది. దర్శకుడు అనిల్ రావిపూడి మార్కు కామెడీ మరియు ఫ్యామిలీ ఎమోషన్స్‌తో రూపొందిన ఈ చిత్రం, థియేటర్లలో ఏకంగా రూ.375 కోట్లకు పైగా వసూళ్లు సాధించి ఇండస్ట్రీ హిట్లలో ఒకటిగా నిలిచింది. మెగాస్టార్ చిరంజీవి సరసన నయనతార కథానాయికగా నటించగా, విక్టరీ వెంకటేష్ తన స్పెషల్ అప్పీరెన్స్‌తో ప్రేక్షకులను ఫిదా చేశారు. ముఖ్యంగా ఓటీటీలో స్ట్రీమింగ్ అయ్యే వెర్షన్‌లో థియేటర్లో కట్ చేసిన కొన్ని చిరంజీవి, గణెళిష్ కాంబినేషన్ కామెడీ సీన్లను కూడా జత చేయబోతుండటం విశేషం.

Printed , Published & Owned by GADDAMEDI BALARAJU, Printed, at YAGNA PRINTERS AND PUBLICATIONS # 18-105/4,Opp:SBI,Hanumanpet,Malkajgiri (M),Medchal-Malkajgiri District,Telangana State-500047 And Publishedat H. NO: 4-54-246,.Maqdum Nagar, Jagathgirigutta,IDA Jeedimetla,Balanagar Township,Medchal-Malkajgiri ,Telangana-500037 Editor : GADDAMEDI BALARAJU Cell: 9848802025 RNI.No. APTEL/2009/29786.